

- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

# రాజ్యాంగంలో అవర్ణులుగా కొనసాగుతున్న బీసీలు, మహిళలు, మైనారిటీలు

సామాజిక శాస్త్రవేత్తలు 'సమాజం ఏకరూపంగా లేదని, వర్గాలుగా, కులాలుగా, ప్రాంతాలుగా ఏర్పడి కలిసి జీవిస్తున్నారని' అంటుంటారు. కలిసి జీవించే క్రమంలో ఇవి ఏర్పడి కొనసాగుతుంటాయి. భాషల వారీగా, మతాల వారీగా, సంస్కృతుల వారీగా వైరుధ్యాలు, వైవిధ్యాలు, భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం సమ్మేళనంగా సమాజాలు కొనసాగుతూ వస్తున్నాయి. వీటిమధ్య ఘర్షణలు, ఐక్యతలు, సహజీవనాలు, పరమత సహనం, పరభాషా సహనం, పరకుల సహనం, పరప్రాంత సహనం కొనసాగడం వల్ల సమాజాలుగా కొనసాగుతున్నాయి. వీటిమధ్య విభేదాలు, అస్థిత్వవాదాలు, అణచివేతలు పెరిగినప్పుడు సంఘర్షణలు పెరుగుతాయి. విడిపోవచ్చు. రాష్ట్రాలుగా, దేశాలుగా, కులాలుగా, మతాలుగా విడిపోవచ్చు. భాషల వారీగా విడిపోవచ్చు. అందరిని కలిపి ఉంచే ఒక తాత్విక, సామాజిక వాస్తవిక ఆవశ్యకత ఉన్నప్పుడు కలహించుకుంటూనే కలిసి ఉండవచ్చు. భారత రాజ్యాంగంగా అనేక వర్గాల, కులాల, ప్రాంతాల, మతాల, సంస్కృతుల, భాషల సమ్మేళనంలో కలిసి జీవించే లక్ష్యాలను మనముందుంచింది. ఆధిపత్య వర్గాలు, ఆశ్రిత వర్గాలు, పీడిత వర్గాలు, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, ఆధునిక సమాజ నిర్మాణం అన్నీ కలిసి సామాజిక న్యాయం, ధర్మం లక్ష్యంగా రాజ్యాంగం రూపొందించబడింది.

ఆదర్శాలు, సిద్ధాంతాలు, లక్ష్యాలు ఎంత గొప్పవైనప్పటికీ నిగ్గుతేలేది ఆచరణలోనే. అప్పుడే వాటి గుణ దోషాలు తెలిసివస్తాయి. ఏక పార్టీ సోషలిస్టు కార్మికవర్గ నిర్మాణం గురించి చెప్పిన ఆదర్శాలు, సిద్ధాంతాలు ఆచరణలో నియంత్రణను, నియంతృత్వాన్ని సృష్టించాయి. బహుళ పార్టీ వ్యవస్థలో ఎన్నో అవకతవకలు, అవినీతి, వక్రమార్గాలు, బలవంతుల రాజ్యంగా మారడం గమనించవచ్చు. వీటన్నిటిని గమనించి పరిష్కరించుకుంటూ సాగాలని, భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా సాగడానికి ప్రధానంగా మూడు వ్యవస్థల్ని సృష్టించడం జరిగింది. ఒకటి ప్రజల ప్రాతినిధ్యంతో ఏర్పడే చట్టసభలు. ప్రజల ప్రాతినిధ్యం చట్టసభల్లో ఉండడం. రెండు పరిపాలన యంత్రాంగం చట్టాలను, పరిపాలనను అమలు చేయడం, కొనసాగించడం. మూడు న్యాయ వ్యవస్థ. రాజ్యాంగంలో పేర్కొన్నమేరకు సామాజిక న్యాయం, సామాజిక మార్పు అందించడం అందుకు గల అవరోధాలను చర్చించి, తొలగించి అందరికి అవకాశాలు, న్యాయం, ధర్మబద్ధంగా అందించడం. ఈ మూడు కాలగతిలో నూతన వర్ణ వ్యవస్థగా స్థిరపడ్డాయి. వర్ణ వ్యవస్థ తొలికాలంలో ఆర్య, త్రైవర్ణిక అని మూడు వర్ణాలే పేర్కొన్నారు. నాల్గవ వర్ణంగా శూద్రులను చేర్చారు. భారత రాజ్యాంగంలో పత్రికా స్వేచ్ఛ, మీడియా అనేది నాలుగో స్తంభంగా, అనగా నాలుగో వర్ణంగా చెప్పినట్టయింది. ఇలా ఆర్య త్రైవర్ణికలో ఏది బ్రాహ్మణులతో సమానమైనది? చట్టసభలు రాజులకు, చక్రవర్తులకు, మంత్రులకు సంబంధించినవి కనుక వీరిని క్షత్రియ వర్ణంగా పేర్కొనవచ్చు. పరిపాలనా వ్యవస్థను, పరిశ్రమలను, వ్యాపారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని, వైశ్య వర్ణంగా చెప్పవచ్చు. న్యాయ వ్యవస్థను బ్రాహ్మణ వర్ణంగా పేర్కొనవచ్చు. 'దైవం మంత్రాదీనం, మంత్రం బ్రాహ్మణాదీనం, బ్రాహ్మణో మమదేవతా' అని సూక్తి. దైవం మంత్రానికి అదీనం. మంత్రం బ్రాహ్మణుల అదీనం. కనుక బ్రాహ్మణులే దైవం అని అర్థం. చట్టసభలు, వాటి శాసనాలు న్యాయ వ్యవస్థ అధీనం. న్యాయ వ్యవస్థయే దైవం అని చెప్పుకోవచ్చు.

ప్రజలు ఎన్నుకునే ప్రజాప్రతినిధులు, వారు చేసే శాసనాలు, నిర్ణయాలు, పరిపాలనా వ్యవస్థ అమలు జరపాలి. వాటి మంచి చెడులను న్యాయ వ్యవస్థ నిర్ణయిస్తుంది. అందువల్ల న్యాయ వ్యవస్థ బ్రాహ్మణీయ వర్ణంగా చట్టసభలు, ప్రజాప్రతినిధులు శక్తివర్ణంగా, పరిపాలనా వ్యవస్థ, వైశ్య వర్ణంగా, సేవకులుగా, శూద్ర వర్ణంగా పరిగణించవచ్చు. ఇలా ఆర్య త్రైవర్ణిక నుండి చాతుర్వర్ణాలు విస్తరించినట్లయింది.

చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఇవి 1932లో గాంధీ, అంబేడ్కర్‌ల మధ్య జరిగిన పూనా ఒప్పందంతో ప్రారంభమయ్యాయి. అలా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. అలా భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలు ప్రాతినిధ్యం రాజ్యాంగబద్ధంగా చేర్చబడ్డారు. తద్వారా భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలు సవర్ణులు అయ్యారు. ఎస్సీ, ఎస్టీల్లో క్షత్రియులు, బ్రాహ్మణులు, వైశ్యులు ఏర్పడ్డట్టు చట్టసభలు, పరిపాలనా యంత్రాంగం న్యాయ వ్యవస్థలో స్థానం లభించడం వల్ల మూడు వర్ణాలు వారిలో క్రమంగా, స్థిరంగా ఎదుగుతూ వచ్చాయి. భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలను ఇన్‌క్లూడ్ చేసుకుంది. బీసీ, ఓబీసీలకు చట్టసభల్లో, పరిపాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో భారత రాజ్యాంగం రిజర్వేషన్లను, ప్రజాప్రాతినిధ్యాన్ని జనాభా దామాషా మేరకు కల్పించలేదు. వారిని భారత రాజ్యాంగం జనాభా ప్రాతినిధ్య నిష్పత్తి లేకుండా చేసింది. ఇలా బీసీ, ఓబీసీలు భారత రాజ్యాంగంలో ఎక్స్‌క్లూడ్ అయ్యారు. భారత రాజ్యాంగానికి వెలుపలివారయ్యారు. మనుధర్మం వర్ణ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీలు వర్ణులుగా పరిగణించబడ్డారు. భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలు సవర్ణులు అయ్యారు. కాగా బీసీలు, ఓబీసీలు భారత రాజ్యాంగంలో అవర్ణులయ్యారు. భారత రాజ్యాంగానికి వెలుపలివారయ్యారు.

భారత రాజ్యాంగంలో బీసీ, ఓబీసీలకు జనాభా దామాషా మేరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించే చర్చలు 1935 రాజ్యాంగ రూపకల్పన సందర్భంగా కొద్దిపాటి చర్చలు జరిగాయి. దాన్ని నిరాకరించడం జరిగింది. అదేవిధంగా 29 నవంబర్ 1949న ఆమోదించిన నేటి రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగ పరిషత్ చర్చల్లో బీసీ, ఓబీసీలకు ప్రజాప్రాతినిధ్యం గురించి కాస్త సమయం కేటాయించి, చర్చించి చివరకు నిరాకరించారు. 1951లో మద్రాసు రాష్ట్రంలో బీసీలకు మెడికల్ సీట్లలో కొంత రిజర్వేషన్ కల్పించిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ చంపకం దొరై రాజన్ కోర్టుకు వెళ్ళడం జరిగింది. సమానత్వానికి, సమాన అవకాశాలకు అది వ్యతిరేకమని ఉన్నత న్యాయస్థానం ఆ రిజర్వేషన్ను కొట్టివేయడం జరిగింది. బీసీలకు అలా జనాభా దామాషా మేరకు సమాన అవకాశాలు పొందే హక్కును నిరాకరించడం జరిగింది. తద్వారా సుప్రీంకోర్టు బీసీలను భారత రాజ్యాంగానికి వెలుపలివారని, భారత రాజ్యాంగం వారికోసం కాదని, వారి ప్రయోజనాల కోసం రాయబడలేదని స్పష్టం చేసినట్లయింది. జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ మొదటి రాజ్యాంగ సవరణతో అనేక ఆర్టికల్స్ భారత రాజ్యాంగంలో చేర్చారు. అందులో బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పిస్తూ, 14, 15, 16, 31బి, 338 వంటి ఆర్టికల్స్‌లో కొన్ని క్లాజులు చేర్చడం జరిగింది.

**పాలితులే హక్కులను కోరుతుంటారు. హక్కులు కోరేవారంతా పాలితులే. పాలితులకు పాలితులుగా ఉండే హక్కులు, అవకాశాలు ఎప్పుడైనా హరించవచ్చు.**

విద్య, ఉద్యోగ రంగాల్లో రాష్ట్ర స్థాయిలో బీసీలను ఎంతో కొంత అవకాశం కల్పించారు. ఈ రెండు రంగాల్లో భారత రాజ్యాంగంలో బీసీలు కొంతమేరకు సవర్ణులయ్యారు. కేంద్రం స్థాయిలో అనేక ఆటుపోట్ల తర్వాత మండలి కమిషన్ సిఫారసులలో కొన్నింటిని ఆమోదిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. అవి ప్రస్తుతం 7-11 శాతం మాత్రమే అమలవుతున్నాయి. కాగా విద్యారంగంలో ఓబీసీలకు 2006లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆ మేరకు విద్యాసంస్థల్లో సీట్లను పెంచడం జరిగింది. ఇలా 2006 నుండి విద్యారంగంలో ఓబీసీలు సవర్ణులయ్యారు. 11-13 శాతంగా ఉన్న ముస్లింలు, మైనారిటీలు చట్టసభలలో, పరిపాలనా యంత్రాంగంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు లేవు. కనుక వారు భారత రాజ్యాంగంలో ఆమేరకు అవర్ణులుగా కొనసాగుతున్నారు. ఓబీసీలు చట్టసభల్లో, పరిపాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో అవర్ణులుగా కొనసాగుతున్నారు. 52 శాతం జనాభా గల ఓబీసీలు 13 శాతంగల మైనారిటీలు భారత రాజ్యాంగానికి అవర్ణులుగా మిగిలిపోయారు.

70 యేళ్ళ వాస్తవిక ఆచరణలో 65 శాతం ప్రజలు భారత రాజ్యాంగానికి వెలుపలివారయ్యారు. వెలివేతకు గురయ్యారు. ఎక్స్‌క్లూడ్ అయ్యారు. అవర్ణులయ్యారు. 49 శాతం గల మహిళలు చట్టసభల్లో, తదితర రంగాల్లో ప్రజాప్రాతినిధ్యం లేకపోవడంవల్ల అవర్ణులుగా కొనసాగుతున్నారు. 35 శాతం అగ్రవర్ణ, అగ్రకులాల్లో సగంమంది మహిళలే కనుక. వారిని మినహాయిస్తే 18 శాతం అగ్రవర్ణ, అగ్రకుల పురుషులు భారత రాజ్యాంగంలో క్షత్రియ వర్ణంగా కొనసాగుతున్నారు. 17 శాతం మహిళలతో 65 శాతం బీసీలు, మైనారిటీలు కలిపి 82 శాతం ప్రజలు భారత రాజ్యాంగానికి వెలుపలివారయ్యారు. పాలితులుగా వారికి కొన్ని హక్కులు కల్పించబడ్డాయి. పాలకులుగా, పరిపాలనాదక్షులుగా, న్యాయమూర్తులుగా ఎదగడానికి వారి జనాభా ప్రాతినిధ్యం మేరకు రక్షణలు, అవకాశాలు కల్పించబడలేదు. నిరాకరించబడ్డారు. అందువల్ల అసమానుల మధ్య పోటీలో గెలవాల్సిన స్థితిలో కొనసాగుతూ వస్తున్నారు.

పాలితులే హక్కులను కోరుతుంటారు. హక్కులు కోరేవారంతా పాలితులే. పాలితులకు పాలితులుగా ఉండే హక్కులు, అవకాశాలు ఎప్పుడైనా హరించవచ్చు. హరించే అవకాశం చట్టసభలకు, పరిపాలనా వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు, రాజ్యానికి, రాజ్యాంగానికి ఉందని, అనేక ఉదాహరణలతో నిరూపించవచ్చు. రాజ్యాంగంలో చేర్చిన 9వ షెడ్యూల్‌లో గల వందలాది చట్టాలను సుప్రీంకోర్టు పరిధినుండి మినహాయించడం జరిగింది. ఆ లిస్టు చూస్తే, సుప్రీంకోర్టు ఎన్ని విధాలుగా నష్టం చేసే అవకాశం ఉందని శాసనకర్తలు భయపడ్డారో తెలుస్తుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు, బాలబాలికలకు, వృద్ధులకు కల్పించే ప్రత్యేక అవకాశాలు, రక్షణలు భారత రాజ్యాంగం ఒకటవ, రెండవ, మూడవ ఆర్టికల్స్‌లతో సమానంగా, వాటి పక్కన ఆర్టికల్ 2ఎ, ఆర్టికల్ 3ఎ లలో భాగంగా చేర్చి కొత్త షెడ్యూల్స్ రూపొందించడం ద్వారా భారత రాజ్యాంగంలో పూర్తిస్థాయిలో ఇన్‌క్లూడ్ అవుతారు. అప్పుడే చట్టసభలు పూర్తిస్థాయి శాసనకర్తలుగా తమ అధికారాన్ని నిలుపుకున్నవారవుతారు.

ప్రజల ప్రాతినిధ్యం లేని, పరిపాలనలో ప్రాతినిధ్యం లేని, సైన్యంలో, న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని, పారిశ్రామిక రంగంలో ప్రాతినిధ్యం లేని, సామాజిక వర్గాలు, కులాలు, ప్రాంతాలు, జనాభా పాలితులుగా, రెండవశ్రేణి పౌరులుగా కొన్ని హక్కులకు, పరిమితులకు లోబడి జీవిస్తున్నారని అర్థం. రాజ్యాం, రాజ్యాంగం, రాజులు, పాలకులు, వ్యవస్థలు అన్నీ బలవంతుల నుండి బలహీనులను రక్షించి భద్రత కల్పించడానికి ఏర్పడ్డవే. ఒక భర్త, ఒక భార్య అనే కుటుంబం, పెళ్ళి వ్యవస్థ అలా బలవంతులు, బలహీనుల పోటీలో బలహీనులకు రక్షణ కలిగించిన మొట్టమొదటి వ్యవస్థ అని మరచిపోకూడదు. కానీ భారత రాజ్యాంగాన్ని మెరిట్, ప్రతిభ, సామర్థ్యం వంటి ఆధునిక భావజాలంతో బలవంతుల రాజ్యంగా, బలవంతుల కోసమే రాజ్యాంగం అన్నట్లుగా ప్రచారం చేయడం విచారకరం. రాజ్యాంగ సమీక్షలో వీటిని సమీక్షించి 52 శాతం జనాభా గల ఓబీసీలకు 50 శాతం, 49 శాతం గల మహిళలకు 49 శాతం, 13 శాతం గల మైనారిటీలకు 13 శాతం మేరకు చట్టసభల్లో, పరిపాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో, సైనిక వ్యవస్థల్లో, పారిశ్రామిక రంగాల్లో జనాభా మేరకు ప్రాతినిధ్యం కల్పించి భారత రాజ్యాంగాన్ని సుసంపన్నం చేయడం అవసరం. అప్పుడే అందరికి సమాన అవకాశాలు లభిస్తాయి. అందుకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల ఒరవడిని ఆదర్శంగా తీసుకొని చట్టసభల్లో ఉన్న సీట్లను నాలుగు రెట్లు పెంచుకోవడం ద్వారా ఈ సమస్య శాంతియుతంగా, అందరికీ అవకాశాలు కల్పించే దిశగా భారత రాజ్యాంగం, భారతీయ సమాజం ముందుకు సాగుతుంది.

# తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో "పూలసింగిడి" ఆవిష్కరణ

తెలంగాణాలో మాత్రమే విశేష ప్రచారాన్ని పొందిన బతుకమ్మ పండుగ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహార్నవమి వరకు తొమ్మిది రోజులు ఈ పండుగ జరుగుతుంది. దీనిలో భాగంగా మొదటి ఎనిమిది రోజులూ, పెళ్ళికాని ఆడపిల్లలు ఆడుకుంటారు. దీనిని బొడ్డెమ్మ అంటారు. తొమ్మిదవ రోజున మాత్రం చద్దుల బతకమ్మ అంటారు. బకతమ్మ పండుగ ఆశ్వయుజ మాసంలో రావడం వల్ల వర్ష ఋతువుతో విండిన చెరువులు, తొణికస లాడుతూ వుంటాయి. పండి ఒరిగిన జొన్న చేలూ, పచ్చగా పెరిగే పైరు సంపద, విరబూసిన చెట్లతో ప్రకృతి సౌందర్యమయంగా వుంటుంది. ఈ పండుగ రోజుల్లో పుట్ట మన్నుతో ఒక బొమ్మను చేసి, బహుళ పంచమి నాడు దానిని ప్రతిష్ఠించి దాని పైన, ఒక కలశాన్ని వుంచి, కలశంపైన పశుపు ముద్దతొ గౌరమ్మను నిలిపి పూలతోనూ, పసుపుతోనూ అలంకరిస్తారు. ఈ విధంగా ప్రతి ఇంటిలోనూ చేయకపోయినా, గ్రామానికి ఒక గృహంలో చేసినా సరి పోతుందని వారి అభిప్రాయం.

బొడ్డెమ్మను నిలిపిన తరువాత ఆ వాడలో వున్న ఆడపిల్లలందరూ అక్కడ గుమికూడుతారు. ఈ వినోదాన్ని చూడడానికి పెద్ద లందరూ వస్తారు. ఇలా ఎనిమిది రోజులూ కన్నె పడచులు ఆడుకుంటారు. తరువాత నవమి రోజున కోడి కూసే సమయాన స్త్రీలు లేచి, పరిసరాలన్నీ తిరిగి రకరకాల పూలు సేకరించి గోరు వెచ్చని జీడిగింజల నూనెతో తలంటి పోసుకుని నూతన వస్త్రాలు ధరించి అలికి ముగ్గులు వేసిన ఇంట్లో చాపు వేసి బతకమ్మలను పేర్చి గుమ్మడి పూవు అండాశయాన్ని తుంచి పసిడి గౌరమ్మగా పెడతారు. పసుపుతో ముద్ద గౌరమ్మను చేసి పెట్టి అగరవత్తులు వెలిగించి పసుపు కుంకాలతో అలంకరించి పగలంతా అలాగే వుంచుతారు. సాయంత్రం పిన్నలు, పెద్దలు, నూతన వస్త్రాలు ధరించి స్త్రీలు, వివిధ అలంకారాలను అలంకరించుకుని బతకమ్మలను చేత బట్టుకుని చెరువు కట్టకో, కాలువ గట్టుకో దేవాలయానికో వెళ్ళి బతకమ్మలను మధ్య వుంచి, బాలికలు, కన్నె పడుచులు, స్త్రీలు వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు చరుస్తూ, గొంతెత్తి ఒకరు పాడగా వలయాకారంగా తిరుగుతున్న వారు ఆ పాటను అనుసరిస్తూ పాడుతారు.

ఆ దృశ్యాన్ని గ్రామస్తులందరూ ఆనందిస్తూ వుంటారు. మగపిల్లలు కొయ్య గొట్టాలలో, కాగితపు అంచులను కన్నెపిల్లల పైనా స్త్రీల పైనా ప్రయోగిస్తారు. బతకమ్మ పాటలు, ఒకో ప్రాంతంలో ఆయా మాండలిక పదాలతో ప్రతి చరణాంతం లోనూ, ఉయ్యాలో అని, కోల్ కోల్ అనీ, చందమామా అనీ, గౌరమ్మ అనీ పదాలు పాడతారు. పాటల్లో లక్ష్మీ సరస్వతుల స్తోత్రాలేగాక, అనేక పౌరాణిక గాథలైన, శశి రేఖ, సతీ అనసూయ, కృష్ణలీల, సీతా దేవి వనవాసము మొదలైనవే గాక, సారంగధర, బాలనాగమ్మకు సంబంధించిన పాటలు కూడా పాడుతూ వుంటారు. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన వుత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించుకుంటారు. ఆడ పిల్లల్ని పుట్టింటికి తీసుకువస్తారు. కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలకు అత్తగారి ఇంటి నుంచి కాగితపు పూలతో చేసిన బతకమ్మను వాయినంగా పంపుతారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా ఎప్పుడు కన్న వారింటికి వెళ్ళాలా? కన్నవారి పిలుపు ఎప్పుడు వస్తూందా? తనను తీసుకు వెళ్ళడానికి అన్న ఇంకా రాలేదే అన్న బాధను వ్యక్త పరుస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అనే పంథాలో సాగుతున్న ఈ పాట ఎవరి వేదననైనా అందులో పొందుపరచి బతుకమ్మతో విన్నవించుకుంటారు.



"పూల సింగిడి" కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న అతిథులు.

ఇలాంటి గొప్ప సంప్రదాయాన్ని గౌరవిస్తూ.. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు తెలంగాణ జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నాడు (30-01-2019) రవీంద్రభారతిలో జరిగిన బతుకమ్మ సంబరాలతో రవీంద్రభారతి ఆవరణ మారుమ్రోగింది. పెద్ద ఎత్తున మహిళలు హాజరై తమ ఆటపాటలతో సభను కనువిందు చేసారు. అనంతరం 316 మంది మహిళల కవితలతో "పూలసింగడి" అనే గ్రంథాన్ని ఆల్ ఇండియా రేడియో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శైలజాసుమన్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శైలజాసుమన్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇంతమంది కవయిత్రులతో కవిసమ్మేళనం జరగలేదని, ఇంత గొప్ప కవిసమ్మేళనం జరపాలను అనుకోవడమే బతుకమ్మకు ఇస్తున్న గౌరవం అన్నారు. అయినంపూడి శ్రీలక్ష్మి, జ్వలిత, అరుణ నారదభట్ల, సరోజ సంపాదకత్వంలో వెలువరించిన కవితా సంకలనంలో 316 కవయిత్రుల కవితలు వెలువడటం తెలంగాణ సంస్కృతికి గర్వకారణం అన్నారు. పూలతో పూలను పూజచేసే సంస్కృతి ఈ బతుకమ్మ పండుగలో ఉందని, జాగృతి అధ్యక్షురాలు కవిత బతుకమ్మను ప్రపంచవ్యాప్తం చేసారని అని తెలిపారు. ఈ సభలో తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం నేత, ప్రముఖ కవయిత్రి జ్వలిత అధ్యక్షోపన్యాసం చేస్తూ సామాన్యులు సైతం జరుపుకోగల పండుగ ఈ బతుకమ్మ పండుగని, గ్రామాలలో పొలాల గట్లమ్మట దొరికే పూలు ఈ పండగలో ప్రధానమని, వాటిని ఏర్చికూర్చడంలో స్త్రీల నైపుణ్యం ఎంతో దాగుందని ప్రశంసించారు. ఈ సభలో అభినవ మొల్ల బిరుదాంకితురాలు చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ, తిరునగరి జానకీదేవి, సిస్టర్ నివేదిత అతిథులుగా పాల్గొన్నారు. ప్రముఖ కవయిత్రి, అయినంపూడి శ్రీలక్ష్మి, నమ్మెట విజయ ఈ సభకు సమన్వయకర్తలుగా పాల్గొన్నారు. జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనం సభికుల్ని ఆకట్టుకుంది.

ఈ సభలో ప్రముఖ కవయిత్రులు శీలాలోలిత, శైలజామిత్ర, తమిరశ జానకి, సముద్రాల శ్రీదేవి, ఆకెళ్ళవెంకట సుబ్బలక్ష్మి, కేతవరపు రాజ్యశ్రీ తదితర కవయిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ అంటే బతకునిచ్చే అమ్మ అని కొందరంటే, బతుకమ్మను ఆహ్వానిస్తూ కొందరు, బతుకమ్మలో పేర్చే పూల సువాసనల వివరణలు కొందరు, బతుకమ్మ వర్ణనతో కొందరు తమ కవితలను వినిపించారు. దాదాపుగా అనేకమంది మహిళలు కవితా గానంతో సభికుల్ని ఆకట్టుకున్నారు. మహిళా శక్తిని వివరిస్తూ, అమ్మ అందరికీ అమ్మే, ఆవేదనైనా, ఆనందమైనా పంచుకునేది అమ్మకే కదా అనే వివరణతో సాగిన పాటలు ఎంతో అలరించాయి.




రవీంద్రభారతి ఆవరణలో బతుకమ్మ ఆట, పాట

ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆధ్వర్యంలో
ప్రముఖ ముంబయి రచయిత
డా॥ అంబల్ల జనార్దన్
ముంబయి చూపుతో....
తెలుగు కథానికలు
గ్రంథావిష్కరణ మహోత్సవం
తేది : 12-10-2019 శనివారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్
ముఖ్య అతిథి ఆవిష్కర్త : డా॥ నందిని సిధారెడ్డి, అధ్యక్షులు - తెలంగాణ సాహిత్య అకాడమీ
సభాధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి, కార్యదర్శి - తెలంగాణ సాహిత్య అకాడమీ
విశిష్ట అతిథి : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు - తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాస్, సంపాదకులు - నేటి నిజం దినపత్రిక
గౌరవ అతిథులు : శ్రీ ఆనంద చక్రపాణి ప్రముఖ సినీ నటులు
గ్రంథ పరిచయం : డా॥ ప్రభాకర్ జైనీ ప్రముఖ రచయిత, దర్శకులు
స్పందన : డా॥ అంబల్ల జనార్దన్ గ్రంథ రచయిత
అందరూ ఆహ్వానితులే !
బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, మానస ఆర్ట్ థియేటర్స్
డా॥ లలిత వాణి, ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్ థియేటర్స్
రఘుశ్రీ, కార్యదర్శి, మానస ఆర్ట్ థియేటర్స్ 9247108893

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
తేజ ఆర్ట్ క్రియేషన్స్ నిర్వహణలో
నిజామాబాద్ పట్టణానికి చెందిన రచయిత
శ్రీ దారం గంగాధర్ నవల
"ఆరాటం" ఆవిష్కరణ
ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా॥ నందిని సిధారెడ్డి గారు, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
సభాధ్యక్షులు : డా॥ నాళేశ్వరం శంకరం గారు, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
విశిష్ట అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ గారు, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ
గౌరవ అతిథి : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాసు గారు, సంపాదకులు, నేటినిజం దినపత్రిక
పుస్తక పరిచయం : శ్రీ కె.పి. అశోక్ కుమార్ గారు, ప్రముఖ విమర్శకులు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్,
తేది : 04-10-2019 శుక్రవారం సాయంత్రం 6-00 గం॥లకు
ఆహ్వానించువారు
డా॥ పోరెడ్డి రంగయ్య, అధ్యక్షులు, తేజ ఆర్ట్ క్రియేషన్స్, సెల్: 9948049864

నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

గురువారం 3-10-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

నల్ల సూరీడు
దక్షిణాఫ్రికాగాంధి
పోరుకు కీర్తి

చంద్రయాన్‌టూ
అందని నెలరాజు
ఆశ చావదు

బొమ్మల గుడి
ధార్మిక దారిద్ర్యం
దారి మళ్లింది

సగటులోటు
ప్రగతికి చిల్లులు
పద్దుల బిల్లు

దోమ రక్కసి
పగలు రాత్రి దాడి
సుర తాగింది



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

సూర్య చంద్ర కాంతులోలె
రెండు జీవనదులు!
రథగజ తురగాదులోలె
మున్ముందుకు కదులు!

ఉదకక్షేత్ర రంగంలో
గోదావరి కృష్ణవేణులు!
గాండీవం రణశంఖం
పూరించిన కృష్ణార్జునులు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## పాకాల యశోదా రెడ్డి గారి
# 'బరిబత్తల బొమ్మ' కథా పరిశీలన



**మృగాళ్ల చేతిలో చిక్కుకున్న ఆడపిల్లలు చివరకు సావే శరణ్యంగా ఎందరో జీవితాలను పణంగా పెడుతున్నారు.**

*యశోదారెడ్డి 8 ఆగస్టు 1929 లో మహబూబ్ నగర్ జిల్లా బిజినపల్లి గ్రామంలో జన్మించారు.*

*అక్టోబరు 7 -2007లో స్వర్గస్తులైనారు.*

*తల్లి సరస్వతమ్మ ,తండ్రి కత్తి కాశిరెడ్డి ఆమె పుట్టిన నెల రోజులకే తల్లి మరణించింది తల్లి మరణంతో దూరపు బంధువు రుక్మిణమ్మ చేతిలో పెరిగింది .*

*ప్రాథమిక విద్య మహబూబ్ నగర్ లో ,ఉన్నత విద్యను హైదరాబాద్ నారాయణగూడ లోనిబాలికోన్నత పాఠశాలలో పూర్తి చేసింది .రాజ బహద్దూర్ వెంకట్రామి రెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్యను కొనసాగించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు ,సంస్కృతం, భాషల్లోపోస్టు గ్రాడ్యుయేషన్ చేసి జర్మన్ భాషలో, భాషాశాస్త్రంలో డిప్లమా చేసింది. ఉస్మానియా*

*విద్యాలయంలో' తెలుగులో హరి వంశాలు' అనే అంశంపై డాక్టరేట్ పొందిన యశోదమ్మకు హిందీ ఉర్దూ కన్నడ భాషలతో పాటు జర్మన్ భాష తో పరిచయం పరిచయం ఉన్నా తెలంగాణ బిడ్డగా , తెలంగాణ*

*భాషకు పట్టం కట్టి పలుకుబడుల తో కథా రచనలు చేస్తూ ముందు తరాలకు అందించి తెలంగాణ యాస, భాష పై మక్కువ పెంచుకున్న యశోదారెడ్డి నుండి1999 డిసెంబర్ వెలువడిన ధర్మశాల కథ సంపుటంలోని బరిబత్తల బొమ్మ కథ ను పరిశీలించడం జరిగింది*

## కథా పరిచయం

రాత్రి 11 గంటల సమయం శారద భర్త గాఢ నిద్ర లో ఉన్నాడు .ఆకలితో ఏడుస్తున్నబాబుకు పాలను అందిస్తున్న శారదకు దొడ్డి తలుపు ఎవరో కొడుతున్నట్లు వినబడడం తో ఏ పిల్లులో, కుక్కలో అనుకుంటుంది కానీ తలుపులు ఆత్రంగా కొడుతున్న శబ్దం వినడంతో భర్తను నిద్రలేపి తలుపులు ఎవరో కొడుతున్నారు నేను వెళ్ళానా అంటుంది .వద్దని వారించి వెళ్లిన అతను శారదా !అని కేకలు వేయడంతో పిల్లవాని వదిలి పరిగెత్తిన శారదకు కనపడిన దృశ్యంతో నోట మాట రాక అలాగే నిలబడిపోతుంది. దయనీయస్థితిలో ఆకర్షణీయమైన శరీరంతో ఉన్న నగ్న స్త్రీ తనను తను దాచుకోవడానికి ప్రయత్నించినా ఆమె వద్ద ఏమీ లేక నిస్సహాయ స్థితిలో ఉన్న స్త్రీని చూసిన శారద భర్త ఆమెకుతన షర్టు విప్పి ఇవ్వడంతో అదే ఆమెకు చుట్టి ఇంట్లోకి తీసుకొస్తుంది శారద.

అప్పటికే అర్ధరాత్రి దాటడంతో ఆమెకు చీర ఇచ్చి పడుకోమని చెప్పి లోపలికి వెళుతుంది . పొద్దున చూసిన శారదకు కనబడకపోవడం తో రాత్రి వచ్చిన స్త్రీ కనబడటం లేదంటూ భర్తకు చెప్తుంది. మరో మంచి గిరాకీ కి వెళ్ళి ఉంటుంది అంటూ ఇంకా నయం నీవు ఉన్నావు కాబట్టి సరిపోయింది అంటుంటే మావారేన ఇలా మాట్లాడుతున్నాడు అనుకుంటుంది శారద.

ఆమెగురించి ఎక్కువగా ఆలోచించుకంటూ వెళ్ళిపోతాడు .ఏదో జ్ఞాపకం వచ్చిన శారద ఇంటి వెనక ముళ్ళకంపలతో , గడ్డితో ఎప్పుడునీటితోనిండుగా ఉండేబావి, ఆ పక్కనే పాము ఉండే పెద్ద పుట్టతో చిత్తడిగా వుండే ఇంటి వెనుకకు వెళ్ళేవరకు బావిలకి దూకడానికి సిద్ధంగా ఉన్న స్త్రీని నెమ్మదిగా వెళ్ళి ఆపుతుంది

నన్నుచావనివ్వు శారద అంటున్న ఆమెతో నేను ఎలా తెలుసు అంటూ,పోల్చుకొని నువ్వు పార్వతమ్మ కూతురు అనసూయవు కదా అంటుంది.అవును స్కూల్లో నీకు జూనియరని టెన్త్ లోఫస్ట్ ని బరిబత్తల బొమ్మని ,ఇంకా బతికి ఉంటే ఎంగిలివిస్తరిని,అంగడి బొమ్మనంటు శారదపై వాలి ఏడుస్తుంది.

ఎందుకిలా అన్నప్పుడు మా అమ్మ సంప్రదాయ కుటుంబంలో పుట్టినా ,విధి వక్రించిన పేదరికంతో మా తాత మా అమ్మను 'వోలి' తీసుకొని పూర్తి వయసుడిగిన మూడో పెళ్లి వాడికి ముడి కట్టాడని ,నేను పుట్టిన

> **ఎదుగుతున్న నన్ను చూసినతర్వాత ఏం తోచిందో, నా పోశణ పట్ల ఎంతో శ్రద్ధ ఏర్పడింది. ప్రవర్తనలో మార్పులు కనిపెట్టిన అమ్మ తన కథనంతా చెప్పి నాన్న కాని నాన్నతో జాగ్రత్తంటు హెచ్చరించింది.**

తర్వాత ఆయన మంచం పడితే, భర్త సేవలో మునిగి పోయింది అమ్మ.

మా ఊరికి వచ్చిన రామారావు డాక్టరు అమ్మ ఆకర్షణతో రోగిని చూసే నెపంతో వచ్చి ప్రయత్నపూర్వకంగా అమ్మని తాకుతూ ,అమ్మకు చేరువై రేపోమాపో అతను చనిపోతే నిన్ను కళావిహీనం చేస్తారు నాతో వచ్చేయ్ పెళ్లి చేసుకుంటానని చెప్పిన మాటలు నమ్మి నాతోపాటు అతనితో వచ్చేసింది .డబ్బు కోసం గడ్డి తినే వాడుఅతడు. తండ్రిగా నా బాగోగులు పట్టించుకోకపోయినా అమ్మ ఏమనేది కాదు .అమ్మ మంచం పట్టిన తర్వాత ఎదుగుతున్న నన్ను చూసినతర్వాత ఏం తోచిందో , నా పోశణ పట్ల ఎంతో శ్రద్ధ ఏర్పడింది. ప్రవర్తనలో మార్పులు కనిపెట్టిన అమ్మ తన కథనంతా చెప్పి నాన్న కాని నాన్న తో జాగ్రత్తంటు హెచ్చరించింది.

ఒకరోజు ట్యూషన్ చెప్పడానికి వెళ్తుంటే మందు పొట్లాలు గెస్ట్ హౌస్ ప్రక్కన బంగ్లా లో ఉన్న పెద్ద మనిషికి ఇవ్వమన్నాడు. నేను వెళ్లిన కాసేపటికి తను బయటకు వచ్చి కాఫీ తీసుకుని వెళుదువని లోపలికి రమ్మని, నేను వెళ్తాను అంటే ఎక్కడికి వెళ్తావంటూ (అసలు బేరం మీ అమ్మతో కుదుర్చుకున్నాడు కాని దానికి జబ్బు చేసిందని నిన్ను పంపాడని) నానారకాలుగా నన్ను చుట్టుకునే వాడి చేతులలో ఎంత గింజుకున్నా వదలక పోవడంతో కొరికి పరిగెత్తు తుంటే వెంట్రుకలు పట్టుకుని లాగి వివస్త్రని చేశాడని, ఇంతలోకి గేటు తీసిన శబ్దం తో తలుపు తియ్యమని స్త్రీ గొంతు విని వెనక వైపు నుండి అవతలికి నెట్టి వేయడంతో బయటపడి పరిగెత్తు తుంటే నా ఆకారాన్ని చూసి మనిషి రూపంలో ఉన్న వేటకుక్కలు వెంబడించడంతో రక్షణ కోసం మీ ఇంటి తలుపు తట్టాను. మీ ఇల్లు అని తెలియదు నిన్ను చూసిన తర్వాత ఇక్కడ ఉండటం భావ్యం కాదని బయటకు నడిచి ఆలోచించాలి అనుకొని మనసులో మీ వారికి నమస్కరిస్తూ బయలుదేరిన నాకు బావి కనిపించింది. ప్రతీకారం తీర్చుకోవాలి అనుకున్నాను.

ఉగ్రవాదుల్లో చేరి వాడిని చిత్రవధ చేయాలనుకున్నాను చేయలేని అశక్తత అన్యాయాన్ని ఎదిరించే శక్తి లేదంటున్న అనసూయతో భయం లేదు పదమంటు , నిస్సహాయంగా స్త్రీ ఉన్నంతకాలం సంఘం ఒకటై పిచ్చి కుక్కలను తరిమినట్లు తరుముతుంది . నువ్వు కాదు నిన్నా స్థితిలో చూసిన సంఘం అంటు మా సఖ్య సమాఖ్య ఉంది ,భావన సాహితీ ఉంది స్త్రీవాద సంక్షేమ సంఘ సభ్యులు ఉన్నారు వాళ్ళంతా సంఘటితమై వాన్నిమూడు చెరువుల నీళ్ళు తాగిస్తారు నీ కాళ్ళపై పడవేస్తారు ఇప్పటికి శాంతించమంటు ఇంటి లోపలికి తీసుకు వెళ్లడం తో కథ ముగుస్తుంది .

## కథా విశ్లేషణ

ఆడపిల్లలకు పెళ్లి చేయకుంటే సమాజంలో సూటిపోటి మాటలు తట్టుకోలేక ఎవరికో ఒకరికి కట్టబెడితే చాలన్నట్లు సంప్రదాయ కుటుంబంలో పుట్టినా పేదరికం పెను శాపమైన పార్వతిని తండ్రి 'వోలి' తీసుకుని మూడో పెళ్లి వాడికి ముడిపెట్టడంతో పెళ్ళైఆమె జీవితానికి శాపమైంది.

ఆడపిల్లకు పెళ్లి అయితే చాలు ఆ పిల్లకు ఏమైనా పర్వాలేదు తల రాత గా సరిపెట్టుకుంటారు పెద్దలు. వోలి ఇచ్చి పెళ్లి చేసుకున్న ఆ వృద్ధుడికి కావలసింది భార్య కాదు బాగోగులు చూసుకునే ఆయా, ఆ వయసులో తీర్చుకున్న కోరికలతో పార్వతికి 'పాప' నందించి, మంచం పట్టిన అతనికి విసుగు విరామం లేని సేవలు చేస్తున్న ఆమెకు తన జీవితం గురించేఆలోచించటం మరచిపోయింది.డాక్టరుగా ఆమె భర్తను చూడడానికి వచ్చిన రామారావు ఆమెను ఏ విధంగానైనా సొంతం చేసుకోవాలనుకుంటాడు . పార్వతి పై ఆకర్షణతో పిలిచిందే తడవుగావచ్చి

ఆమెలో నిద్రాణమైన కోరికలను లేపుతూ,

మీరు అనుభవిస్తున్న నరకం చూస్తున్నానని మీ కోరికల గొంతు నులమకండంటూ, నా వెంట వస్తే స్వర్గ సుఖాలను చూపిస్తానంటూ ,భర్త చనిపోతే జరిగే తతంగాలతో మీరు బయటకు రాలేరు .అలాకళావిహీనమై వచ్చిన నిన్ను పెళ్ళిచేసుకోలేను కనుక ముందే వెళ్ళి పోయి పెళ్ళి చేసుకుంటానన్న రామారావు మాటలు నమ్మి తెలిసీ తెలియని తనంతో కూతురుతో సహా బయటకు వచ్చిన పార్వతితో డబ్బులుసంపాదించేవాడన్నది (అసలు బేరం మీ అమ్మతోనే కుదుర్చుకున్నాడు దానికి ఏదో జబ్బు చేసిందని నిన్ను పంపాడు) అనడం లో అర్థమవుతుంది.

ఒకసారి ఇంట్లో నుండి కాలు బయట పెట్టిన స్త్రీ ఎన్ని ఇబ్బందుల నెదుర్కొన్నా తిరిగి ఇంటికి వెళ్లాలంటే వెళ్ళలేదు అనే విషయం రామారావుకు తెలుసు కనుక పార్వతినితనకు అనుకులంగా మార్చుకున్నాడు .గత్యంతరం లేక బురదగుంటలోనే వుండిపోయింది పార్వతి.

రామారావు డబ్బు కోసం గడ్డి తినేవాడు అనడానికి, అనసూయను చిన్నప్పుడు ఆదరించని వాడు ఆమె ఎదిగేకొద్దీ పోషణ పట్ల శ్రద్ధ తీసుకోవడం చూసిన పార్వతి తనలా తన కూతురు బలి కాకూడదని తన కథనంతా చెప్పి ,నాన్న కాని నాన్న తో జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తుంది. సహనానికి మారుపేరు గా ఊహించుకున్న తల్లి కథతో అంతుచిక్కని రహస్యాల ఆలోచనలతో మునిగిన ఆమెను ఆప్యాయంగా చూసే రామారావు కుటిలనీతిని తెలుసుకోలేక పోతుంది.

ట్యూషన్ చెప్పి వస్తూ గెస్టుహౌస్ పక్క బంగళాలోవున్న పెద్ద మనిషికి మందు పొట్లాలు ఇచ్చి అతను ఇచ్చిన డబ్బులు తీసుకురమ్మని ,మంచి చీరకట్టుకొని వెళ్ళమనడం లోని ఆంతర్యాన్ని గ్రహించలేక డాక్టర్ కూతుర్ని కదా! పెద్దమనిషి ముందుకు పాత బట్టలత వెళితే బాగుండదు అనుకుంటుంది .ట్యూషన్ నుండి పెద్దాయనఇంటికి వెళ్లిన అనసూయకు అక్కడి వాతావరణం అగమ్యగోచరమై వెళ్తానంటు లేవడంతోఎక్కడికి వెళ్తావంటు అదిమి పట్టుకున్న అతని పట్టునుండి విడిపించుకుంటూ , ఆలస్యమైతే నాన్న కోప్పడుతాడు అంటుంది .ఎవడే నాన్న ఆ తార్పుడు గాడా? అనడంతో పరిస్థితిని అర్థం చేసుకున్న అనసూయ ఎంత బతిమాలినా వదలకుండా తన చుట్టు చుట్టుకున్న చేతులలో నలిగి పోతున్న సమయంలో గేటు తీసిన శబ్దంతో పాటు తలుపు తియ్యమన్న స్త్రీ మాటలు విన్నమానవ మృగం కంపించే శరీరంతో నక్కలా, అనసూయ వివస్త్రగా వున్నా బయటకు నెట్టి వేస్తాడు.

భార్యా ,బిడ్డలతో సర్వ సంపదలున్నా, అన్యోన్య దాంపత్యం కరువై ,నమ్మకం విశ్వాసం కోల్పోయిన స్త్రీ భర్తను రెడ్ హ్యాండెడ్గా పట్టుకోవాలన్న ఆలోచనే అనసూయకు వరం అయింది. ఇలా ఎందరో స్త్రీల జీవితాలు నాశనం చేస్తున్నాడు. ఒక్కొక్క మగవాడు వక్రబుద్ధితో స్త్రీని విలాస వస్తువుగా వాడుకుంటున్నారు.ఎవరి జీవితం చూసినా ఏదో ఒక గాధవున్నా రాజీపడి జీవిస్తున్నారు.

తనను తాను రక్షించుకోవడానికి పరుగెత్తుతున్నఆకారాన్ని చూసి వెంట పడ్డ మనిషి రూపంలో ఉన్న వేటకుక్కలను తప్పించుకోవడానికి శారద ఇంటి తలుపులు తడుతుంది. తలుపుతీసిన శారద భర్తకూడనువ్వున్నావు కాబట్టి సరిపోయింది అనడంతో ఎంతటి మగాడినైనా స్త్రీ అందం తొట్రుపాటుకు గురిచేస్తుందని, సంస్కారం,సాంఘిక కట్టుబాట్లుపతనాన్ని ఆపుతాయనడంలో సందేహం లేదు.

చావుకు సిద్ధమైన అనసూయనుకాపాడిన శారద ప్రతీకారం తీర్చుకోవడానికి మార్గం ఉంది అంటూ,ఎవరి మీద ప్రతీకారం తీర్చుకుంటవంటు పరిస్థితులను బట్టి నడుస్తున్న మానవ సమాజం బలహీనులను , నిస్సహాయంగా ఉంటే వెంట పడితరుముతుందని ,అవమాన పడవలసిన పని నీవు ఏం చేయలేదని స్త్రీవాద సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి దుర్మార్గాలను అరికట్టి శిక్ష పడేలా మార్గం చూపుతుంది శారద

మృగాళ్ల చేతిలో చిక్కుకున్న ఆడపిల్లలు చివరకు సావే శరణ్యంగా ఎందరో జీవితాలను పణంగా పెడుతున్నారు.ఒంటరి స్త్రీ అయినా కష్టాలను ఎదుర్కొనే ధైర్యంగా నిలబడుతూ స్త్రీ వాదులతో ఏకమై దుర్మార్గులను , సమాజంలోని ఒడిదొడుకులను ఎదుర్కొని తనకు తాను నిరూపించు కోవాలికానీ చావకూడదన్నది రచయిత్రి ఆకాంక్ష.

నాటి నుండి నేటి వరకు కూడా పరిస్థితిలో మార్పు రాలేదన్న చేదునిజం ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది.


*7 అక్టోబర్ 2019 పాకాల యశోదా రెడ్డి సంస్మరణ సందర్భంగా ఆమె కథను సృజిస్తూ ఆమెకు నీరాజనాలు అర్పిస్తూ...*



**-డా॥బండారి సుజాత**
సెల్ : 9959771228

# నానీల కవి మాయకుంట్ల కవన 'పయనం'

పుస్తక సమీక్ష



రెండు దశాబ్దాల క్రితం డా॥ఎన్.గోపి కలం నుండి ముత్యాల్లా రాలిన నానీలు తర్వాత కాలంలో కుంభవృష్టిని తలపిస్తు కవన క్షేత్రాన్ని విస్తృతంగా ఆక్రమిస్తూనే వున్నాయి. అప్పట్నుంచి ఆగింది లేదు. ముసురులా వేలకు వేల నానీలు అన్ని సాహిత్య పత్రికల్లో తళుక్కుమంటూనే వున్నాయి. లబ్ధ ప్రతిష్ఠులతో బాటు కొత్తగా రాస్తున్న వారు, కేవలం నానీలతోనే కవులగా మారుతున్న వారు వందల సంఖ్యలో వున్నారు. 350కి పైగా నానీ గ్రంథాలు వెలువడ్డాయంటే ఈ కవితా ప్రక్రియకు పెరుగుతున్న ఆదరణను గమనించవచ్చు. ఒకటిని మించి సంపుటాలు వెలువరించిన నానీ కవుల సంఖ్య గూడ గణనీయం. ఆ కోవలోని కవి మాయకుంట్ల నారాయణరెడ్డి.

మొన్న 'నానీ వీచికలు'.. నిన్న 'వివేక వీచికలు"తో ఆగక తన నానీల పయనం'తో కవన ప్రస్థానం కొనసాగిస్తూనే వున్నాడు. నారాయణరెడ్డి స్వతహాగా సహజనటుడు. ఆరున్నర అడుగుల ఆజానుబాహుడు. వ్యక్తిత్వం కూడా అంతే ఉన్నతమైనది. సినీ రంగంలో నటుడిగా.. హెూటర్ నిర్వహణా రంగంలో సుశిక్షితుడిగా నాలుగు దశాబ్దాల అనుభవం. అపార జీవితానుభవం సంతరించుకున్న అనంతపురం రైతుబిడ్డ. అరవై సంవత్సరాల వయస్సుతో కవిగా తనను తాను తీర్చి దిద్దుకుంటున్నాడు. దానికి నానీల మార్గాన్ని ఎంచుకున్నాడు. సాహిత్యాభిలాషి, అధ్యయనశీలి అయిన మాయకుంట్ల ఎక్కడ ఏ సాహిత్య సభ జరిగినా హాజరుకావడం, కవిమిత్రులతో సత్సంగం నెరపడం ఆయన నిత్యకృత్యం. నానీల నిర్మాణ పద్ధతులను లోతుగా పరిశీలించాడు. ప్రాణ వాయువులాంటి 'చరుపు' (punch) ను ఆకళింపు చేసుకున్నాడు. రుచి తగిలింది. ఎడతెరపి లేకుండా గట్టి నానీలను సాహితీ క్షేత్రంలో విత్తుతునే వున్నాడు. పనసకర్ల ప్రకాష్, వైరా, పోరెడ్డి, సి. భవానీదేవి, నారాయణశర్మ వంటి కవులు అద్భుతమైన నానీలు సృజించి ఈ ప్రక్రియ సుస్థిరతకు తోడ్పడ్డారు. నాణ్యమైన నానీలు రాసిన కవులు యింకా ఎందరో వున్నారు. యిప్పుడు నారాయణరెడ్డి వారి సరసన నిలబడి అనర్ఘ రత్నాల్లాంటి కవితలు అందిస్తున్నారు.

**"అవును/ దుక్కి దున్నడం జూదమే**
**గెలిస్తే వరి/ ఓడితే ఉరి"** ఈ నానీ బహుళ ప్రాచుర్యం పొందింది. బైస దేవదాసు అనేక సభల్లో ప్రస్తావించి ప్రశంసించిన కవితా రూపం యిది. ఎప్పుడో మూడేళ్ళ క్రితం నారాయణరెడ్డి రాసిన ఈ నానీ అంతగా గుండెకు హత్తుకున్నదంటే అంత బలంగా చెప్పాడన్నమట. అంతకంటే బలంగా చెప్పిన నానీలు తాజా సంపుటిలో కోకొల్లలు.

**"గుంపులోనా/ దూడకెరుక తల్లి జాడ**
**మనిషి మరిచాడు/ అమ్మ నీడ"** పశువుకున్న యింకిత జ్ఞానం మనిషికి లేదని కవి ఆవేదన.

**"దొంగ స్పందనలకు/ దొరకదు ఘనత**
**మరిగితేనే/ మంచి కవిత"** ఉబలాటపు కవితలు నీటి బుడగలు. రుచిలూరించే మీగడ లాంటి కవిత్వం అంతర్మథనంలోంచి ఆవిష్కృతమవుతుంది. రసాలూరిస్తు చిరకాలం పాఠకుల నాలుకల మీద చిరకాలం నిలిచిపోతుంది.

**"ప్రాస మాత్రమే చాలదు/ కవిత్వానికి**
**'నాదా' ఒక్కటే/ చాలదు స్వారీకి"** అంత్య ప్రాసలు వాక్యానికి తగిలించి అదే కవిత్వమని సంబురపడే ప్రబుద్ధులు అక్కడక్కడా తారసపడ్తుంటారు. వెతికి పడే ప్రబుద్ధులు గోచరించరు. గుర్రంలేని స్వారీ లాంటిది అలాంటి కవన పయనం. కవిత్వమంటే తన దృక్పథాన్ని స్పష్టం చేస్తున్నాడు మాయకుంట్ల.

**"నదుల కలయిక/ తీరే కోరికా?**
**వచ్చే ఎన్నికలకిది/ పాచిక!"** నమ్మేవారుంటే సముద్రాన్ని హైద్రాబాద్ తరలించి పోర్టు నిర్మిస్తామని వాగ్దానాలు చేసే రాజకీయ నాయకులకు కొదవలేదు.

**"అందరి జీవితాలు/ మృత్యువుతో 'ఫుల్‌స్టాప్'.**
**కవికి మాత్రమే! 'కామా'!**
చనిపోయినా బ్రతికి వుండేది కవి మాత్రమే. అతను సృజించిన క్షరం కాని అక్షరం శాశ్వతం.

**"చిరునవ్వే వరం/ చిరాకెందుకు?**
**పోయేదేముంది/ పువ్వును చూసి నేర్చుకో"**
ఈ విశ్వంలో ఏ జీవికీ దక్కని వరం మనిషికి స్వంతం. అదో ఆభరణం. దాన్ని దాచడమెందుకు? రాలిపోతూ కూడా వికసించిన నవ్వు పువ్వుది. మనిషిని నేర్చుకోమంటున్నాడు కవి.

**" జై జవాన్, జై కిసాన్/ దేశభద్రం**
**అక్టోబర్ రెండునే/ ఉదయించె మరో వజ్రం"**
ఈ తరానికి లాల్ బహదూర్ శాస్త్రిని గుర్తు చేస్తున్నాడు.

**"ఒక్కసారి స్పర్శకే/ ప్రేమతో తలవూపు**
**'కుక్కా' అంటారెందుకు/ మనిషిని?"**
వ్యాఖ్యానం అక్కర్లేని నానీ.

**"కంటతడి పెట్టడమెంతో/ సులభం**
**సాయపడకపోతే/ ఏంలాభం?"** పెదాల పలకరింపులు, ఉత్తుత్తి ఓదార్పులకు స్వస్తి పలికి చేతనయినంత సాయం చేయడం మేలు అని హితవు పలుకుతున్నాడు.

**"ఓటమి/ గెలుపుకు ఆహ్వానం**
**గెలిచేదాకా/ పోరాటమే పరిష్కారం"** వ్యక్తిత్వ నిర్మాణానికి చక్కని చిట్కా.

అనేక జీవన సందర్భాలను, జీవిత అనుభవాలను రంగరించి సామాజిక స్పృహతో నానీలను ప్రవచిస్తు సాహిత్య పయనం కొనసాగిస్తున్న మాయకుంట్ల నారాయణరెడ్డిని కలుసుకుందాం రండి. ఈ పయనం మరో నానీ సంపుటి దాకావో లేక నిరంతరం కొనసాగుతుందో భవిషత్తే నిర్ణయించాలి. ఎన్ని రాసినా కవిత్వాంశ సడలకుండా కాపాడుకోవడం మాయకుంట్లకు బాగా తెలుసు.

ప్రతులకు: మాయకుంట్ల నారాయణరెడ్డి
2-2-647/29/ఎ
ఎస్-1, శరణం అపార్ట్‌మెంట్స్
శివంరోడ్డు, న్యూనల్లకుంట
హైదరాబాద్-500 044
సెల్: 99896 86603



**- రమణ వెలమకన్ని**
సెల్: 98660 15040

# ఘనంగా జరిగిన మరసం 32వ వార్షికోత్సవం

- **మాట, పాటలతో ఉద్యమంలో లక్షల మంది ప్రభావితం**
- **మరసం 32వ వార్షికోత్సవ సభలో మంత్రి హరీశ్‌రావు**




మరసం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు.


ఒక్క కవిత, మాట, పాట, వెయ్యి ప్రశ్నలకు సమాధానమిస్తుందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మంజీరా రచయితల సంఘం (మరసం) 32వ వార్షిక్సోవం సిద్ధిపేటలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై హరీశ్‌రావు మాట్లాడుతూ 'యాచించి కాదు శాసించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలి' అన్న ఆచార్య జయశంకర్ అన్న మాటలు ఉద్యమాన్ని ఉగ్రూతలూగించాయని చెప్పారు. రాష్ట్రాన్ని విభజిస్తే తెలుగు తల్లి, భాషను ముక్కలు చేసినట్లు అవుతుందని ఆంధ్ర పాలకులు, నేతలు పిడివాదాన్ని ప్రదర్శిస్తే.. నాడు గోరటి వెంకన్న 'ఇద్దరం విడిపోతే భూమి బద్దలవుతుందా' అంటూ తన పాటతో ఆంధ్రనేతల వంద ఉపన్యాసాలకు సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. మరసంతో తనకు కేసీఆర్‌కు అనుబంధం ఉందన్నారు. సామాజిక మాధ్యమాలు ప్రభావశీలంగా మారినా 32 ఏళ్లుగా మరసం మనుగడ సాగించడం విశేషమన్నారు. ఉద్యమకాలంలో విడుదలైన తొలి క్యాసెట్‌లో సీఎం కేసీఆర్ సిపాయిల తిరుగుబాటు అనే పాటను రాశారని గుర్తు చేశారు. ఎందరో సాహిత్యాభిమానుల సాహిత్య దాహాన్ని మరసం తీర్చాలిస ఉన్నదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దేశంలో నేడు స్వేచ్ఛను హరించి బంధనాలు వేసే పరిస్థితి వచ్చిందని.. ప్రశ్నించే వారిని జైళ్లకు పంపుతున్నారన్నారు. మతం ప్రాతిపదికన కాకుండా జ్ఞాన ప్రాతిపదికన ఉండే సమాజం కోసం కృషి చేయాలని చెప్పారు. దేశంలో నేడు నెలకొన్న విభిన్నమైన పరిస్థితులు, ధోరణుల వల్ల సమాజానికి ఏకత్వంలో భిన్నత్వమనే అవసరం ఏర్పడిందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. మరసం ప్రేరణ పొందిన కవులకు బృహత్తర బాధ్యత ఉన్నదని చెప్పారు. అనేక మతాల సమూహమే హిందూమతమన్నారు.

సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ మంజీర రచయితల సంఘం తెలుగు సాహిత్యంపై తనదైన ముద్ర వేసిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో మరసం కీలకంగా పనిచేసిందని చెప్పారు.ఈ సభలో 'వర్తమాన కథ-జీవితం' అన్న అంశంపై ప్రముఖ రచయిత్రి కాత్యాయనీ విద్మహే ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశపాండే, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విరాహత్‌అలీ, మరసం వ్యవస్థాపక సభ్యుడు కొమురవెల్లి అంజయ్య, తైదల అంజయ్య, తోట అశోక్, రంగాచారి పాల్గొన్నారు.

# తమసోమా జ్యోతిర్గమయ

శ్రీరాముని సత్య వాక్పాలనం
శ్రీకృష్ణుని అమేయజ్ఞానం
గౌతమబుద్ధుని జీవ కారుణ్యం
రూపుదాల్చిన యోగి గ్రామణి బాపూ
హింసా వ్యాకులమైన జగత్తునకు
శాంతి బోధలు గరపిన భరతమాత
ముద్దుబిడ్డ మన జాతిపిత
సనాతనమైన ఆర్ష తేజోరూపుడు
మన మోహనుడు
అతడి అహింసా సవనమే తల్లి
భారతి దాస్య విముక్తి మంత్రం
అతడి స్వధర్మ నిర్వహణమే
సమస్త జనావళికి మేల్బంతి

ఒడలు దేశ సేవకు ఎడద రామునిసేవకు
అంకితమిచ్చిన ఋషివరేణ్యుడు
హిందువితడు, ముసల్మానతడు
క్రైస్తవుడు వేరొకడని తారతమ్యమెంచక
సర్వులలో సర్వేశ్వరుని దర్శించిన



ప్రేమ బలధియతడు

పరాధీనమైన జాతికే కాదు
పరతంత్రమైన ఆత్మకు సైతం
స్వతంత్రతను ప్రసాదించిన
అతి మానుష ప్రజ్ఞానిధి
మహాత్మా! సత్యాహింసా క్రాంతీ!
గాఢ సుషుప్తిలో మునిగిన జాతికి
వెలుగు వైతాళికుడవై మరలిరావా?
ఆనవాళ్ళు అందని గ్రామ సీమలను
అనుబంధాల అంకురమై అలరించవా?

సంహృత సకలాహంకృతి!
రాతి విగ్రహాలలో వివర్ణుడవుకాక
జనుల గుండె గుడులలో పదిలమై పరిమళించవా?
తమస్సులో నిండిన జాతిని
జ్యోతిర్మయంగా తీర్చిదిద్దవా?
సహిష్ణుత ఒక్కటే విశ్వ శ్రేయస్కరమని
మరొక్కమారు చాటి చెప్పవా?
(అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా..)



**- డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి**
9394113848





## “మొగ్గలు” ప్రక్రియలో బతుకమ్మ..








తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకవుతూనే
సంస్కృతి సంప్రదాయాలను చాటుతూ వస్తున్నది
బతుకమ్మ తెలంగాణ వాకిళ్ళలో పూచిన పూలగుమ్మ

ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటుతూనే
సల్లంగ బతుకమంటూ మనకందరికీ బతుకునిస్తున్నది
సబ్బండజనం ఒక్కటై జరుపుకునే పండుగ బతుకమ్మ

రకరకాల రంగురంగుల పూలతో సింగారించుకుంటూనే
ఆధ్యాత్మికశోభతో అలరించే బంగారుకల్పవల్లి బతుకమ్మ
ఆడబిడ్డలు సందడిగా చేసుకునే పండుగ బతుకమ్మ

తీరొక్కపూలను తీసుకొచ్చి అందంగా తీర్చిదిద్దుతూనే
గల్లిగల్లిన అంబరాన్నంటే పూల పండుగ సంబురాలు
తెలంగాణ సామాజిక ఏకతకు నిలువుటద్దం బతుకమ్మ

చిత్తుచిత్తులబొమ్మ శివుని ముద్దులగుమ్మ అంటూనే
పూలతో జాతరను మైమరపించే అరుదైన వేడుక
భువిలో పూలను పూజించే విశిష్ట పండుగ బతుకమ్మ



– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

ఎంగిలి పూలతో మొదలవుతూనే
సద్దులబతుకమ్మ వరకు సంబరాలు
తొమ్మిది రోజుల తీరొక్క బతుకమ్మ

తొమ్మిదిరోజులు మాతల్లి గౌరమ్మ
తొమ్మిది తీర్లుగా దర్శనభాగ్యం
నవరాత్రులకు నాంది బతుకమ్మ

పసుపుల పుట్టిన గౌరీమాత
మెత్తని పువ్వుల ఒడిలో పాన్పు
గంగమ్మ చెంతకు చేరు గౌరమ్మ

సబ్బండ వర్ణాల సకల జనులను
ఉయ్యాల పాటలతో ఉర్రూతలూగించు
ఊరువాడను ఏకం చేసేది బతుకమ్మ

తాంబాలమంత తంగేడు పువ్వులు
గుడిగోపురమంత గునుగుపువ్వులు
తీరొక్కపూల సింధూరం బతుకమ్మ



–గంగాపురం శ్రీనివాస్
9676305949

లోకమంతా పసుపువర్ణాలను అద్దుకొని
బతుకమ్మలు తెలంగాణ సంస్కృతిని మోసుకొచ్చాయి
దుష్టులను దునుమాడి పేదలను దీవించే బతుకమ్మ

బతుకమ్మ బహుజన బతుకుల్లో
తంగేడు పూలవర్షమై కురిసింది
బడుగుజీవితాల్లో హరివిల్లు తంగేడుపూలు

తీరోక్కపూలతేరెక్కి తంగేలపూలు
మదినిండా గుడిగోపురాలు కట్టుకుంది
గోపురంపై గౌరమ్మతో ఆడిపాడే బతుకమ్మ

పడతిచేతుల చప్పుళ్ళ దరువుకు
ఊరుఊరంత జనసంద్రమై బొడ్డెమ్మలాడింది
నవరాత్రి పూలపూజలందుకుంది

బంతీ తంగేడు గునుగులతో గజ్జెకట్టి
పట్టుపూల కోకచుట్టి జగతినే మురిపించింది
ఇంద్రధనస్సునే మరపించేది బతుకమ్మ

వెన్నెలమ్మ నేలపైకి పరుగుపెట్టినట్లుగా
నింగినున్న చుక్కలన్నీ బతుకమ్మగా పేర్పు
ఆకాశమే దిగివచ్చి గౌరమ్మకు పీఠం

పడచులంతా పూలవలువలు గట్టి
గౌరమ్మ సిగలోన పూల అలంకరణ
నింగినేల ఒక్కటై ముద్దాడే పండుగ

సంకురాత్రి ముత్యాలముగ్గుల్లాగా
గొబ్బెమ్మ తలపైన బంగారమై మురిసింది
తంగేడుపూలు బతుకమ్మకు శుభాలు

– సైదులు ఖేతావత్
94929 56438

కష్టసుఖాలనే రెండు కాడెడ్లతో
బతుకు భారంగా సాగుతోంది
బతుకుగీతమే బతుకమ్మ పండుగ

ఆటుపోటుల సంద్రంలా బతుకుతూనే
ఆటపాటల సంబరమవుతుంది బతుకమ్మ
బతుకుపాటల బొడ్డెమ్మ బతుకమ్మ

బతుకు రంగుల కలలే
రంగురంగుల పూలైనాయి
పూలతేనియలే బతుకు మధురిమ

కష్టజీవుల కన్నీళ్ళ వెతలతో
ఒలకబోసుకునేదే బతుకమ్మ పాట
శ్రమజీవన సౌందర్య ప్రతీక పాట

మానవుడు చేసే వికృత చేష్టలతోనే
పర్యావరణం వినాశనమవుతుంది
ప్రకృతి ఆదరిస్తేనే కదా బతుకమ్మ



– కమలేకర్ శ్యాంప్రసాద్ రావు
9441076632

సత్యవంతుడి ఇంటి ఆడపడుచువై పుట్టి
శక్తిస్వరూపిణివై మహాలక్ష్మిగా కరుణించేవు
మహాలక్ష్మి అవతారం చల్లని బతుకమ్మ

తీరొక్కపూలతో నిండు ముత్తైదువులా ఉంటూనే
సౌభాగ్యధాత్రివై పసుపుకుంకుమ ప్రసాదించేను
ఐదవతనం అందించే ఆదిపరాశక్తి బతుకమ్మ

మహిమలు పంచే తల్లే కాదు ప్రకృతి
బతుకుకు భరోసానిచ్చే తల్లి బతుకమ్మ
ప్రకృతి త్రిశక్తి స్వరూపిణి బతుకమ్మ

ధర్మాంగుని ఇంట జన్మించిన మహాలక్ష్మివై
ధరణి జనులపై కరుణచూపే కల్పవల్లి నీవు
బతుకమ్మ ఇంట ఉంటే చాలు బంగారమే

జనపదుల ప్రతీకవే కాదు స్త్రీశక్తిరూపమై
సర్వం వ్యాపించి నిలిచిన ఆదిశక్తిరూపం
అన్నిరూపాలలోన శక్తిరూపం బతుకమ్మ



– శైలజ రాంపల్లి
9550258262

ప్రతివీధిలో ఎక్కడ చూసినా సందడవుతూనే
మన సంస్కృతికి ఆనవాలమయ్యింది బతుకమ్మ
ఆటపాటలతో సాగే పండుగ బతుకమ్మ

ఆడపడుచులు చేసేటి అందాల పండుగవుతూనే
పూలగుత్తులు పేర్చేటి తెలంగాణ పండుగ
ఉత్సాహం నింపే సద్దుల బతుకమ్మ పండుగ

పల్లెలంతా తంగేడుపూలవనంగా మారుతూనే
గోరటి వెంకన్న కలంలో జాలువారింది పాట
పల్లెపల్లెలో ఉత్సాహంగా సాగే బతుకమ్మ ఆట

పరుచుకున్న ముగ్గుల్లో పూలరాశి పోస్తూనే
చప్పట్లు కొట్టి పూజలు చేసి ఆడతారు
బతుకమ్మ ఆటలో మురిసింది ప్రతివాకిలి

పడుచులు పూలరంగుల అందాలవుతూనే
ఊరువాడ ఒక్కటై ఆటలతో విన్యాసాలు
బంధాలను పదిలపరిచేవి బతుకమ్మ పాటలు



– సిద్ధాంతపు
ప్రభాకరాచార్యులు
9491357842

బతుకుసారమంతా బతుకమ్మ తెలుపుతూనే
బతుకు ఆటగా నిలిచి బతుకమ్మ అయ్యింది
చంద్రునివెన్నెల సూర్యుడికాంతి బతుకమ్మ

మగువల మణిదీపం బతుకమ్మ పండుగవుతూనే
తీరొక్కపువ్వులతో పుట్టిన తెలంగాణ పూబోణి
ఆడపడుచులు ఆత్మీయతాగీతం బతుకమ్మ

పట్నంలోన, పల్లెల్లోన తనదైన శైలిని చాటుతూనే
బతుకమ్మ క్షణం తీరిక లేకుండా సంబరమవుతుంది
మంచి సమాజ నిర్మాణం కోసం బతుకమ్మ సంబరం

మన తలరాతలను మార్చడానికి ఆగమిస్తూనే
ప్రకృతి పరిమళాల పూలను గుట్టగా పేర్చుతుంది
భారమైన బతుకులకు బంగారుకాంతి బతుకమ్మ

కష్టసుఖాలను
సమంగా ఆనందించమని ఆశీర్వదిస్తూనే
నిండునూరేళ్లు సుఖంగా ఉండమని దీవించ వచ్చింది
కోటికాంతులతో వెలుగుజిలుగుల బతుకమ్మ తల్లి



– కట్టా అనితారమణ

సిబ్బిలో పులన్నీ సక్కంగా పేర్చుతూనే
సిరిగా కొలిచెదము బతుకమ్మతల్లిని
రంగైనపూలతో పసుపుకుంకుమల బతుకమ్మ

అడబిడ్డలు గూడి నవరాత్రుల వేడుకల్లోనూ
ఆదిశక్తిగా కొలిచినా అభయమిచ్చెను బతుకమ్మ
పిండివంటలతో ప్రీతినైవేద్యముల బతుకమ్మ

కష్టసుఖాలను పాటగట్టి ఆడిపాడినా
కంటికి రెప్పలా కాపాడేటి బతుకమ్మ
పవిత్రంగా కొలిచే ప్రకృతిమాత బతుకమ్మ

కొత్తబట్టలు గట్టి కోలలు చేతబట్టి
ఉల్లాసంతో ఆడిపాడే ఉత్సవమే బతుకమ్మ
అనుబంధాల లోగిళ్ళు ఆడబిడ్డల పుట్టిల్లు

పెద్దలను గుర్తుజేసే పెత్రామాస నాడు
భామలందరి కొంగుబంగారు బతుకమ్మ
తరతరాలకు తరగని సంపదలిచ్చే బతుకమ్మ



– వై.లక్ష్మి రాజేందర్
9849952158

గౌరమ్మ చుట్టూ పువ్వులను పేర్చుతూనే
తీరొక్క రంగుతో చూడముచ్చటగా నేర్పు
మహిళల సౌభాగ్యం బతుకమ్మ పండుగ

చామంతులను రాశులుగా పోస్తూనే
చక్కని పాటలతో ఆటల కోలాహలం
తెలంగాణచరితను జగమంతా చాటే పండుగ

బొడ్డెమ్మను చేసి బొమ్మలా అలంకరిస్తూనే
భర్తలంతా కలిసి భార్యలతో చెరువుకెళ్ళడం
బతుకమ్మను భారంగా చెరువులో నిమజ్జనం

ఆడబిడ్డలు పట్టుచీరలు, నగలెన్నో ధరిస్తూనే
ప్రేమతోడ తులసాకు, సత్తుపిండిని పంచుతారు
పేదధనిక బేధాలు లేక కలిసి ఆడేది బతుకమ్మ

తంగేడు పు(న)వ్వుల తళుకులతోను
పడతులంతా పసుపుతో పులకించేరు
పాటలు పాడుతూ వాయినాల సమర్పణ

గునుగువనం కెళ్ళి గంపనిండా కోసి
గలగల నవ్వుతూ బతుకమ్మ పేర్పు
పిల్లపాపలను చల్లగా చూసే పండుగ



– విజయలక్ష్మి మార
8340 091 972

అడవిలోని పూలను తెచ్చి గంపలవోస్తే
మా వాకిట్లల్లా బతుకమ్మల జాతరైంది
రంగురంగులతో మురిసిపోయిన పల్లెతల్లి

బంతిచామంతి పువ్వులు తెచ్చి
గునుగు గులాబిపువ్వులకు జతకలిపారు
పల్లెపల్లెన గల్లిలన్నీ రంగులపూల జాతర

బొడ్రాయిల కాడ గుమిగూడుతూనే
ఊరూరా బొడ్డెమ్మలు వేసినాము
సింగిడిపూల సందమామ బతుకమ్మ

రంగురంగులపూలతో దర్శనం ఇస్తూనే
మా మనసులు దోచిన పూలపండుగ
మైమరిపించి ఆకట్టుకునే బతుకమ్మ వేడుక

అరణ్యమంతా తిరిగితిరిగి మేమంతా
రంగురంగుల పువ్వులు తెచ్చినాము
అడవిలోని పూలు ఊరుముంగిట హరివిల్లు



– బర్క శశాంక్
8919510355

పగటిసూరిడి కాంతిరేయి చంద్రుని వెన్నెల్లా
కలగల్సిన పసుపుముద్దన ముగ్ద బతుకమ్మ
బత్కుదెర్వు తెల్పు బతుకు ఆటన బతుకమ్మ

కోర్కెల విరుల చాంతాటితో గగన కుసుమాలకై
ప్రాకులాటల, పెనుగులాటల్లోన లీలగా వచ్చెను
తీరొక్కపూలల్ల పుట్టిన మా పూబోని బతుకమ్మ

మార్పు చేర్పుల కాలము మాయలాడియని
జాగురుకత నేర్పగ తరలి వచ్చినట్టి మా తల్లి
పల్లె పట్నమనక ఎల్లడ ఎగ పాకేటి బతుకమ్మ

బతుకు ఆలోచనలలోన ఆవేశమూనకుమని
ఊనిక శమ కనమనె ఉవ్వెత్తు బంగారు పూలు
తలపు తల్పున దాగేను బంగార బతుకమ్మ

మాట ముచ్చటలలోన భోగసౌభాగ్యమున్నదని
మురిపాల చుట్టాల చల్లగా చూడగను వచ్చెను
ప్రతి మదినేలగ కొల్వుదీరిన బంగారు బతుకమ్మ

వనరు నెనరుల బడుగు బత్కునకు ఆసరైనట్టి
వాత్సల్య వార్ధియైన శక్తి తా వరమ్ములివ్వగను
వేల్పు వన గారాల పట్టిగా పుట్టెను బతుకమ్మ

దక్కిన దానిని దైవంగ భావింపమని తెల్పగను
ప్రకృతి పరిమళాల పూల ప్రాణాలలోన దాగెను
భారపు బత్కుల దారుల్ల బంగారు బతుకమ్మ

పూలెన్ని యున్న పూజించు పరమాత్మ ఒక్కటని
ఒక్క మంచి మనసే మనుషికి అలంకారమనగా
అందరినొకటిగ కూర్చ వచ్చె బంగారు బతుకమ్మ

ఇచ్చిన గడువులో నీ యిచ్చకపు సుఖముతోడ
నిండు నూరేళ్ళు నీవు హాయిగా బతుకమన్చు
పండు వెన్నెల్లు బతుకున పండించు బతుకమ్మ



– రాజశేఖర
9441168368

గుండె నిండా విశ్వాసాన్ని నింపుతూనే
బతుకంతా సువాసనలు నింపే చక్కని పండుగ
బతుకమ్మ పండుగ విశ్వాసానికి ప్రతీక

రంగురంగుల పూలు బతుకమ్మగా పేర్చి
గౌరమ్మను ఇంటి బిడ్డగా కొలిచి తరించే పండుగ
బతుకమ్మ తెలంగాణ సమాజపు ఆడపడుచు

ఒక్కొక్క పువ్వు పేర్చి ఒక్కొక్క ఆలోచన చేసినట్లు
నైజామునే నేలకూర్చి ఉద్యమానికి ఊపిరినింపింది
ఉద్యమానికి తొలి సమిధ బతుకమ్మ తల్లి

ప్రతి చెట్టు పుట్టను చెరువును పూజిస్తూనే
ప్రకృతి సల్లగా ఉండాలనీ తలిచే పండుగ
బతుకమ్మ పండుగ అంటే ప్రకృతి ఆరాధన

నవరాత్రులో శక్తి మాతను కొలుస్తూనే
పూలలోనే గౌరమ్మగా చూసి తరించే పండుగ
తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి ఆరాధకులు



– కె.రాధికారాణి
9959853496

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించగానే
బతుకమ్మను బతికించుకున్నది
బతుకమ్మ అంటేనే తెలంగాణ

ఆశ్వయుజ శుద్ధపాద్యమి మొదలుకొని
తొమ్మిదిరోజుల పండుగ బతుకమ్మ
తీపిగుర్తుల బతుకమ్మ బంగారుబొమ్మ

చోళరాజు ధర్మాంగదు నీ చరిత్ర చెబుతూ
నూరుమంది కొడుకులు కన్న ఘనుడంటారు
నూటా ఒకటవ సంతానం బతుకమ్మ

పెద్దలంతా బతుకమ్మ బతుకమ్మ అంటూ
ఆశీర్వాదాలిస్తూ చల్లగా దీవిస్తారు
లక్ష్మీదేవి వరపుత్రిక బతుకమ్మ

బంతి చేమంతి పూబంతులను తెచ్చి
బతుకమ్మనను ఉల్లాసంగా ఆడుతారు
[illegible]య్యారి బతుకమ్మ.



– ఆర్.చెన్నయ్య
9441615293


తీరొక్క పూలతో అందంగా అలంకరించి
బతుకమ్మగా కొలిచి పూజించే పండుగ
ప్రకృతి దేవతలను కొలిచే బంగారు పండుగ

ఊరంతా కలిసి ఒక చోట చేరి బొడ్డమ్మ లాడుతూ
ఉత్సవాలు జరుపుకునే ఉత్తమమైన పండుగ
కలిసి ఉంటే కలదు సుఖమన్న బతుకమ్మ పండుగ

పూలన్నీ తెచ్చి బతుకమ్మతల్లిగా పేర్చి
గౌరమ్మగా కొలిచి తరించే ఊరి పండుగ
ప్రకృతినే దేవతగా కొలిచే పండుగ

సంప్రదాయానికి పుట్టినిల్లయిన తెలంగాణ గడ్డపై
ఆడపడుచులను దీవించే అరుదైన పండుగ
గౌరమ్మ తల్లి దీవెనలు పొందే తెలుగింటి పండుగ

స్వచ్ఛమైన మనసుతో శుభాలను అందిస్తూ
బంగారు బతుకులను అందించే బతుకమ్మ పండుగ
నిర్మలమైన మనసు కు నిర్వచనం బతుకమ్మ పండుగ



– సృజామి
8639260193

అమావాస్యనాడు ఆరంభమైన పూలతేరు
విజయదశమి నాటికి ఊరురా తిరుగుతుంది
పల్లెపల్లెను ఊపే పూలతేరు బతుకమ్మ

తొమ్మిదిరోజులు సంబరంగా జరుపుకుంటూనే
మహిళలు చేసుకునే పండుగ బతుకమ్మ
తొమ్మిది దినాల పండుగ బతుకమ్మ

సప్తవర్ణాల శోభను భూమిపై దించి
రమణీయ కాంతులతో కాంతలు అలరిస్తారు
రంగురంగుల నద్మ కాంతులీనే పండుగ బతుకమ్మ

రంగురంగుల పువ్వుల నడుమ
బంగారు గౌరమ్మను అలంకరించి పూజిస్తారు
ప్రకృతి పూలజాతర బతుకమ్మ పండుగ

తంగేడుపువ్వులను తాంబలంలో పేర్చి
వలయంగా ఉండి బతుకమ్మకై ఆడిపాడ్తరు
ఆటపాటలతో గౌరమ్మను పూజించే పండుగ



– అనుపటి హేమలత
9885133182

ప్రకృతికి సరికొత్త శోభనందిస్తూనే
ఆప్యాయతా అనురాగపు పొదరిల్లయ్యింది
ఆనందంగా సాగే పూలతేరు బతుకమ్మ

తెలంగాణ సంస్కృతికి వారధిగా నిలుస్తూనే
తెలంగాణ అస్తిత్వపు జెండై రెపరెపలాడింది
రంగురంగుల పూలజాతర బతుకమ్మ

జానపదాలను పెదాలపై పలికిస్తూనే
జాగృత పాటల ఊటగా మారింది
తెలంగాణకు సింగిడితోరణం బతుకమ్మ

బానిసబతుకుల ఉద్యమకెరటంగా నిలుస్తూనే
సాంస్కృతిక సారథిగా మారింది
బతుకు చిత్రానికి ప్రతీక బతుకమ్మ

పల్లేరుగాయల జీవనపథంలో ముల్లేరుతూనే
గాయాల గేయమై రాగం తీసింది
పల్లె జీవనపత్రంలో చెరగని సంతకం బతుకమ్మ



– యలకంటి భాస్కర్
9032092772

పొక్కిలి లేసిన మా పల్లె వాకిట్ల నిండ
తీరొక్క పూలు సిందెయ్య వొచ్చినయి
పేదొళ్ళ వోకిట్ల పూలతేరు బతుకమ్మ

పసుపు పారాణిల పరుచుకున్న తంగెడిపువ్వులే
తెలంగాణ తల్లిని ముత్తైదువను జేసి మురిసింది
బతుకమ్మసిగలో పూసిన ప్రకృతిపువ్వు బతుకమ్మ

తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలకు నిలయమై
ఉద్యమాలకు ఊపిరిపోసిన పండుగ బతుకమ్మ
సహజసిద్ధ పుష్పాలే ప్రజా ఉద్యమాల వేదిక

పూలగుంపు జాతరలో ఆడపడుచుల చేతులే
చప్పట్ల తాండవం జేస్తూ తానం ఆడ్తున్నయి
బతుకమ్మ పండుగ స్త్రీ మూర్తులకే మాతృక

దొరల గడిలకాడ ప్రజల ప్రాణాలు కూలుతుంటే
ప్రకృతి పూలపండుగ ధైర్యమై దండల్లి కాపాడింది
ఆపదలను తుంచె అడవి పూలతేరు బతుకమ్మ.



– బోల యాదయ్య
9912206427

ఇంటింటా ఆనందాల పరిమళాలను నింపుతూనే
తెలంగాణ సంస్కృతికి పట్టుకొమ్మగా నిలిచింది
నిండుగా వర్ధిల్లాలని దీవించేది బతుకమ్మ

గునుగు,తంగేడుపూలు, గుమ్మడాకులతో ముస్తాబై
తొమ్మిదిరోజులలో యువతులను ఉత్సాహపరుస్తుం
బొడ్డెమ్మలతో కళకళలాడే తల్లి బతుకమ్మ


జీవితపాఠాలను పాటలుగా సమకూర్చుతూనే
అలంకరణలతో అందంగా రంగరించుకుంటుంది
ఆడిపాడే వనితలను చల్లగా చూసేది బతుకమ్మ

ఔషధగుణాలు పూలతో చెరువులను శుద్ధి చేస్తూనే
అందరికీ ఆరోగ్యాన్ని ఆనందాన్ని పంచుతుంది
ఆరోగ్య ప్రదాయిని మాతల్లి బతుకమ్మ

ప్రకృతి నుంచి వచ్చి ప్రకృతిలోకి కలిసిపోతూనే
సన్మార్గంలో నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది
సకలశుభాలను కలుగచేసే పండుగ బతుకమ్మ




– సునీత బండారు
9440671530






















రకరకాల రంగులపూలతో తయారు చేస్తూనే
త్రికోణాకారంలో అందంగా ముస్తాబవుతుంది
చప్పట్లతాళాలతో పూజలందుకునేది బతుకమ్మ

చిన్నా పెద్ద అనే తేడాలను చూపించకుండానే
ఆస్తిఅంతస్తుల తారతమ్యాలను మైమరిపిస్తుంది
కష్టసుఖాలను మేళవింపు చేసేది బతుకమ్మ

పెత్తందారీతనంతో గ్రామగ్రామాన నలిగిపోతూనే
తెలంగాణ అస్తిత్వానికి ప్రతిరూపమయ్యింది
ఆడపిల్లలకు భరోసా ఇచ్చేది మన బతుకమ్మ

సోదరభావాల ప్రేమానురాగాలను రంగరిస్తూనే
మానవహారంగా ఏర్పడి మమతను కురిపిస్తుంది
ఆత్మీయ అనురాగాలకు ప్రతీక బతుకమ్మ

తెలంగాణ ఉద్యమాలకు ఊపిరిలూదుతూనే
అందరినీ ఏకతాటిపై నిలిపిన ఐక్యతారాగం
తెలంగాణ వీరత్వాన్ని తెలిపేది బతుకమ్మ



**– రవి చంచల**
8600330700

చినుకు చినుకురాలి చిన్ని వాగైనట్లు
తీరునొక్కపూవు చేరి పూలతేరయ్యేను
అందాల బతుకమ్మ అవనిపై నీవేనమ్మా

ఉద్యమాలకు ఊపిరి పోసేందుకు
బతుకమ్మను వాడవాడలా ఊరేగింపు
తెలంగాణ అస్థిత్వపతాక బతుకమ్మ

రంగురంగుల గాజుల సవ్వళ్ళతో
పండువెన్నెల్లో కోలాట చప్పుళ్ళు
బతుకమ్మ పాటలు మన జీవనగీతం

అమావాస్యనాడు మొదలయ్యే వేడుకతో
అంబరాన్నంటే సంబరాలతో ముగిసేను
బతుకమ్మ పూలపల్లకిలో ఊరేగే గౌరమ్మ

అలల ఊయల్లోన అందంగా సాగుతూనే
మళ్ళీవస్తానంటూ కదలివెళ్ళెను ఆడపడుచు
పువ్వుల సెలయేరు మా తల్లి బతుకమ్మ



**– శాంతి కృష్ణ**
9502236670


తెలంగాణంత పసిడిపూల పరిమళం వెదజల్లుతూ
ప్రగతి కోరి పల్లె ముంగిళ్ళలో వెలుగొందుతుంది
బతుకమ్మ పూలవానై కురిసే చలువపందిరి

ఎంగిలిపూలతో బతుకమ్మను పేర్చి
ఆటపాటలతో పల్లె పండుగ జేస్తది
పూలగుంపు చుట్టు ఆడపడుచుల ఆనందం

ముద్దపప్పు సత్తుపిండి సంతృప్తితో నానినా
బియ్యం బెల్లమే గౌరమ్మకు ప్రసాదం
ప్రసాదం ఆరగిస్తేనే తల్లి దయజూపు

ఆడపడచుల అందమైన బొడ్డెమ్మలతో
చుట్టూ తిరుగుతూ నిన్ను తలుతురు
బతుకమ్మ బతుకునిచ్చే పూలదేవత

బతుకమ్మ తీరొక్కపూలతో సింగారించుకుని
ఆపదలుబాపి సంపదలిచ్చే కల్పవృక్షం
గౌరమ్మ ఎప్పుడైనా కల్పవల్లి నీవేనమ్మా



**– డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
9490145913

అవనియందు బ్రతుకును నేర్పే
బతుకుల పండుగై
తెలంగాణ హృదయాంతరమున పండుగైంది
తెలంగాణ సంస్కృతికి ఆయువుపట్టు బతుకమ్మ

ధర్మాంగరాజుకు గారాలపట్టివై పుట్టినప్పటికీ
శ్రీ లక్ష్మి బతుకమ్మవై పూజలు పొందుతున్నావు
సత్యధర్మాలకు ప్రతిరూపం బంగారు బతుకమ్మ

సంబరాలతో బతుకమ్మ పండుగ చేస్తూనే
భవిష్యత్ తరానికి బంగారు బాటలు వేస్తుంది
తెలంగాణ భవిష్యత్తు బంగారు బతుకమ్మ

తెలంగాణవనంలో తీరొక్కపూవోలే మారుతూనే
బతుకమ్మగా మారి మంచిజీవితమే ప్రసాదిస్తుంది
తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ బంగారు బతుకమ్మ

నవరాత్రి ఉత్సవాలు బతుకమ్మ పండుగవుతూనే
ఆడపడుచులందరినీ ఆలింగనం చేసుకుంటది
బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల తోబుట్టువు



**– ముదుంబై శేషఫణి**
9441771955

నవరాత్రులలో నవ్యమైన పండుగవుతూనే
పూవులను పూజించే ప్రకృతి పండుగ
తెలంగాణ బతుకమ్మ మనకందరికీ అమ్మ

ఆడపడచులందరికీ పూల పండుగవుతూనే
బొడ్డెమ్మల పండుగలా తంగేడుపూల పండుగ
ఉల్లాసంగా తొమ్మిదిరోజుల బతుకమ్మ పండుగ

స్త్రీమూర్తుల కష్టసుఖాలకు సాక్షి అవుతూనే
ప్రేమలు,భక్తి,అనురాగాలను పంచుతుంది
జఖతిని జాగృతం చేసే పండుగ బతుకమ్మ

ఎంగిలిపూలతో బతుకమ్మ మొదలుకొని
సద్దుల బతుకమ్మతోనే నిమజ్జనం పూర్తి
ఆటపాటలతో తెలంగాణకే ఘనకీర్తి బతుకమ్మ



మహాలయ అమావాస్యతోనే
బతుకమ్మ సంబరాలు మొదలాయే
మన సంస్కృతికి నిలువుటద్దం బతుకమ్మ
రమణులంతా కలసి రకరకాలపూలతో
శ్రీచక్రమువలె రమణీయముగా పేర్చిరి
బతుకమ్మ స్త్రీలనైపుణ్యానికి దర్పణం
పడుతులంతా చేరి పసుపుగౌరిని చేస్తూనే
పూలగోపురములా చేసి పూజించిరి
బతుకమ్మ భక్తిప్రపత్తులకు ప్రతీక
సుదతులంతా గూడి బతుకమ్మ చేస్తూనే
పప్పుబెల్లాలతో నైవేద్యములు చేసిరి
బతుకమ్మ మన ఆచారానికి సూచిక
కన్నెపిల్లలంతా కలలసాకారానికై
కామితముగ బతుకమ్మను కొలిచిరి
బతుకమ్మ మన విశ్వాసానికి నిదర్శనం
ముద్దుగుమ్మలంతా పట్టుచీరలు కట్టి
ఇంపైన పాటలతో బతుకమ్మ లాడిరి
బతుకమ్మ మన సంస్కృతికి ఆలవాలం
ఉర్వీజనులందరూ లోక కళ్యాణార్థమై
బంగారు బతుకమ్మని ఘనంగా చేసిరి
బతుకమ్మ మన పరోపకార పరమార్థం
చెలియలందరూ చెరువు దగ్గరకు జేరి
ఆటపాటలతో తనివితీరా సాగనంపిరి
బతుకమ్మ తెలంగాణ కలలపంట
వనితలందరూ పసుపుకుంకుమలతో
సద్దులూ వాయనములు ఇచ్చుకుంటారు
బతుకమ్మ తెలంగాణ అసలైన పండుగ



**– కె.సువర్ణాదేవి**
9963222178

సబ్బండవర్ణాలందరినీ సల్లంగా జూస్తూనే
తీరొక్కపూవుల్లో తీరై నిలిచిన పూలరెమ్మ
బతుకును ఇచ్చేటి అమ్మ బతుకమ్మ

ప్రకృతి ఒడిలోని పువ్వుల్లో కొలువుంటూనే
పువ్వు పువ్వున ఆదిశక్తిరూపమై నిండింది
తెలంగాణకు బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ

పల్లెపల్లెల్లోన పూజలందుకొంటూనే
భక్తజనులనందరిని చల్లంగా చూస్తుంది
బతుకును నేర్పేటి అమ్మ బతుకమ్మ

ఆడపిల్లలు ఆడు కోలాటములందుంటు
బొడ్డెమ్మ బంతుల్లో బృందగానమవుతుంది
బతుకమ్మ బతుకై నిల్చే అమ్మ

పువ్వులే దేవతగా పూజలందుకుంటూనే
నవరాత్రులంతా నాట్యమాడే జనజాతర
బతుకుబతుకున కొలువైన అమ్మ బతుకమ్మ



**– భైరోజు రాజశేఖర్**
9441760015

రోజుకో తీరున వైవిధ్యంగా ముస్తాబవుతూనే
మన సంస్కృతిసంప్రదాయాలను చాటుతున్న పబ్బం
బతుకమ్మ అందరి మదిలో కొలువైన దేవత

పడతుల మానసాల్లో సంతసాన్ని నింపుతూనే
మనందరిని ఒక్క చోటికి చేరుస్తున్నది
ఆత్మీయత అనురాగాలకు పెద్దపీటవేసేది బతుకమ్మ

సబ్బండ వర్ణాలను ఏకం చేస్తూనే
అందరి మదిలో ఐక్యతను నింపుతుంది
విరులసిరుల ఘనతను చాటేది బతుకమ్మ

వయస్సుతో నిమిత్తం లేకుండా
అందరిచేత అడుగులు లయబద్ధంగా వేయిస్తుంది
సంబ్రమానంద డోలికల్లో ఓలలాడించేది బతుకమ్మ

ఔషధగుణాల విలువలను తెలియచేస్తూనే
కుసుమకూర్పుతో శోభాయమానమై వెలుగుతుంది
ప్రకృతినే పూజించే పండుగ తెలంగాణ బతుకమ్మ



**– యం.వనజ**
99664 30992

బతుకమ్మ పండుగకు ఎన్నో కథలున్నా
ఆ కథలు త్యాగనిరతికీ నిదర్శనాలు
బతుకునివ్వడమే బతుకమ్మ సందేశం



**– సుంకరి బస్వరాజప్ప**
9603834634

మహిషాసురున్ని వధించిన గౌరీదేవిని
బతుకు అమ్మా అంటూ స్త్రీలు పూజిస్తారు
తొమ్మిది రోజుల పండుగ బతుకమ్మ

ప్రకృతికి ప్రతిరూపంగా నిలుస్తూనే
శ్రీ చక్ర శోభితమై విరాజిల్లుతుంది
తీరొక్క పూలరూపమే బతుకమ్మ

లక్ష్మి, పార్వతీ,సరస్వతీ దేవతల అంశయని
బతుకమ్మను పాటలుగా పాడుకుంటారు
ముగ్గురమ్మల మూలపుటమ్మ బతుకమ్మ

నిండు బ్రతుకును ప్రసాదించే దేవతవుతూనే
సౌభాగ్య సంపద విద్య నొసగే దైవమౌతుంది
సత్కళా రూపిణీయే మన బతుకమ్మ

నీటితో కళకళలాడుతున్న చెరువు కుంటల్లో
ఔషధగుణాలున్న పూదొంతినొదులుతారు
ప్రకృతి సమతుల్యతను కాపాడేది బతుకమ్మ




**– టి.అంబుజ**
9493710142

తెలంగాణలో సంతోష సౌరభాలు వెదజల్లుతూనే
ఆటపాటల పేటికయై ఆనందాలను పంచుతుంది
కనువిందు చేసే ఆనందోత్సాహాల వేడుక బతుకమ్మ

తీరొక్కపూలన్ని బతుకమ్మ తల్లిగా మారుతూనే
సిరిసంపదల గౌరమ్మగా పూజలందుకుంటుంది
ప్రకృతికాంతకు సప్తవర్ణాల పట్టాభిషేకం బతుకమ్మ

కొండకోనల్లో పసిడివర్ణంలో అరుణ కిరణంలా
తంగేడుపువ్వు అడవితల్లి సిగలో ఆభరణమైనది
ప్రకృతికి ప్రతిరూపం సంస్కృతికి ప్రతిబింబం

ఉద్యమంలో అగ్రగామిగా నిలచి ఉద్యమకేతనమైన
తంగేడుపువ్వు తెలంగాణ రాష్ట్ర చిహ్నమై శోభిల్లింది
ఆత్మగౌరవ ప్రతీక తంగేడుపూల బంగారు బతుకమ్మ



**– పులి జమున**
8500169682

తంగేడువనం నిండు ముత్తైదువులా
ప్రతి ఇంటింటికి పూలరాశై శోభనిచ్చింది
బతుకమ్మ ప్రతి ఇంటి పుత్తడిబొమ్మ

గునుగుతోట గజ్జెలాటాడుతుంటే
బంతిపూలు బాసలాడుతున్నయ్
పూలే ప్రతి పల్లెకు పచ్చని తోరణం

బహుజనుల బతుకుల్లో తీరొక్కపూలే
స్వచ్ఛమైన బంగారు ఆభరణాలు
బాధలున్నింట్ల బతుకమ్మే స్వర్ణకానుక

ఆకాశంలో సందమామ నిలవడి సూస్తుండు
నన్ను మించినందం పడుచుల్లో దాగిందని
బతుకమ్మే అందమైన పూలచీర గట్టింది

తెలంగాణ సబ్బండ జాతులకు జీవమై
సాంస్కృతికి స్వర్ణ కమలమైంది
బతుకమ్మ కల్మషం లేని కొమ్మ



**– కె.పి. లక్ష్మీనరసింహ**
90106 45470

సబ్బండ వర్ణాల కుసుమ జాతరలో
తీరొక్క పూల తేరుపై ఉల్లాసంగా ఊరేగేవమ్మా
పూలను పూజించే పండుగే బతుకమ్మ

వెదురు సిబ్బిలో అందంగా ఒదిగి
శిరమున గౌరిని అలంకరించుకుంటావు
మగువల సౌభాగ్యదేవత బతుకమ్మ

తొమ్మిది రోజులు ఇంటింటా వెలిసి
ఆరుబయట ఆటాపాటలతో అలరేవమ్మా
ఐకమత్యపు పండుగ బతుకమ్మ

పట్టుచీరల్లో పడతులు ముస్తాబై
టపాసులతో పిల్లలు మరిసేరమ్మా
ఆనందాలకు చిరునామా బతుకమ్మ

సద్దుల బతుకమ్మవై నువు సాగిపోతుంటే
నీరాకతో చెరువుతల్లి పచ్చగ నవ్వేనమ్మా
తెలంగాణ ఆడపడుచు బతుకమ్మ



**– అయిత అనిత**
8985348424

చావుపుట్టుకలు సహజం అంటూనే
బ్రతికినన్నాళ్లు బాగుండమంటుంది
మన బాగుకోరే తల్లి బతుకమ్మ తల్లి

ఈ సృష్టి పంచభూతాలమయం అంటూనే
వాస్తవ దృశ్యాన్ని ప్రపంచానికి చాటుతుంది
సృష్టిలో అందమైనదీ రంగురంగుల ప్రకృతి

సంస్కృతి సాంప్రదాయాలు మనవేనంటూనే
తెలంగాణ బతుకమ్మ ఆదర్శమంటాం
విశ్వజనీన పండుగ తెలంగాణ బతుకమ్మ


రంగురంగులపూలను చక్కగా పేరుస్తూనే
మహిళామణులంతా ఒక్కటై ఆడుతారు
సకలసంపదల సౌభాగ్యాలవల్లి బతుకమ్మ

జీవితాలను రంగులమయంగా చేస్తూనే
అందరికీ అనురాగాన్ని పంచమంటుంది
సంతోషాల హరివిల్లు
తెలంగాణ బతుకమ్మ



**– అంబటి భానుప్రకాశ్**
9948948787

## బతుకమ్మ - చందనాలు



శతాబ్దాల
చరితగల్ల
బతుకమ్మ
మాయమ్మా !
తెలంగాణ
అస్థిత్వం ..
పెత్తందారి పోకడలకు
కత్తిపట్టలేక జనం
కైతలల్లి ఆటపాట
బతుకమ్మకు వేడికోలు

నవరాత్రుల
ఉత్సవం
వైవిద్యపు
నైవేద్యం
మనోహరం
సద్దులపండుగ
అటుకులు ముద్దపప్పు
బతుకమ్మకు బియ్యమట్లు
సుతిమెత్తటి వేపకాయ
అతి రుచికర సద్దులు

రంగురంగుల
పూలమేడలు
నింగినంటిన
సంభురాలు
తంగేడుల
తళుకులు
పూల వేడుక వసంతం
మూల మూల చేరె నేడు
ఇలలో ఇక్కడే ప్రత్యేకం
తెలంగాణ సంప్రదాయం

వీధివాడ
ఏకమయ్యే
బాధలన్ని
మరిచిఆట..
బత్కుకోరే
బతుకమ్మ
బీద ధనిక తేడ లేక
పదము పదము కలిసి పాడి
ముదితలంతా ముదముతో
మదిలో గౌరి తలపులతో ..



**–పట్టాల అశోక్**
98499 40479

## తీరొక్క పూల బతుకమ్మ

అడవిలోన తంగేడు విరగపూసింది
ఘనముగా గునుగంతా వనంలో వెలిసింది
అడవి పువ్వులన్ని అమ్మ తెచ్చింది
తీరొక్క పూలన్ని ఇంటిలో పరిచింది
చెల్లి పువ్వుల్ని కట్టగట్టి సాపలో పెట్టింది
అక్క గుమ్మడి ఆకుల్ని పరుగున తెచ్చింది


బామ్మ తాంబాలంలో బతుకమ్మ పెర్చింది
వాకిట్లో బతుకమ్మల గుంపు చేరింది
బతుకమ్మ ఆటపాట సంబరం చేసింది
చిన్నారుల కేరింతలు అంబరాన్ని తాకింది
కోలాట నృత్యం కనువిందు నింపింది
తొమ్మిదొద్దుల బతుకమ్మ జాతర చేసింది

ఒడిన చేర్చుకుని గంగమ్మ మురిసింది
గౌరమ్మ పాటతో వాయినం పంచింది
పల్లె పట్నమందు పర్వం నిలిపింది
పువ్వుల్ని పూజించే సంస్కృతి మనదంది
బతుకమ్మ వైభవం జగతంత చాటింది
తెలంగాణ రాష్ట్రాన పూల వర్షం కురిసింది



**–ఉండ్రాల రాజేశం**
9966946084

















పుస్తక సమీక్షలు

# వేదనాభరితం.."అసీఫా కోపం"




ప్రతి రోజూ కనిపించే విషాద అధ్యాయం ఆడపిల్ల జననం. ఆడపిల్ల పుడితే చాలు భయపడిపోయే రోజులు వచ్చాయి. ఒకప్పుడు వయసొచ్చిన ఆడపిల్లల్ని కాపాడాల్సి వచ్చేది. నేడు నెలల పసికందు నుండి ముప్పు ఏర్పడే పాపిష్టి రోజులు వచ్చాయి. వావి వరసలు లేకుండా పురుషులు పురుగుల్లా స్త్రీల శరీరాలను చిధ్రం చేస్తున్న తీరును చూస్తూ తట్టుకోలేక ప్రతి తల్లీ, ప్రతి చెల్లీ, ప్రతి అక్క స్పందించిన తీరు ఈ సంకలనంలో ఉంది. ప్రతి కవితా వేదనాభరితమే. ఆవేదనా సంకలితమే. స్త్రీ అంటే ఒక దేహంగా మాత్రం చూడటం, భోగవస్తువుగా వాడుకోవడం లాంటి వికృత చేష్టల రొచ్చులో ఈ తరం ఒక రకంగా దహించుకుపోతోంది. వీటికి అడ్డు కట్ట వేసేవారు లేరు. అత్యాచారం చేసిన వారు నిర్లజ్జగా వారం రోజులకే బయట పడి తిరుగుతుండటం, అత్యాచారం చేసినవాడు వీడే అని తెలిసినా కూడా తిండిపెట్టి పోషిస్తున్న ప్రభుత్వపు తీరు శోచనీయం.

ఏం చేసినా ఎవరూ ఏమీ చేసేది లేదనుకునే ధైర్యం ఉండటం వలనే ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయి. ఇలా ఎంతకాలం?.. మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలను గురించి గొంతెత్తి అరుస్తున్నా పట్టించుకోని ఈ వ్యవస్థలో స్త్రీ మనుగడ ఏది? వీటిని అరికట్టడానికి ఎవరు ముందుకొస్తారు? అన్యాయం తమ బిడ్డకు జరిగితేనే అది అన్యాయం అవుతుందా? నిరంతరం ప్రగతి పథంలోకి దూసుకెళుతూ దేశాన్ని ముందుకు నడిపించాల్సిన భావితరం ఒక్క అల్పమైె ఆశకోసం బలి అయిపోతోందా? ముందు ముందు దేశ భవిష్యత్ ఏమవుతోంది? ప్రేమపేరుతో ఒకడు, పెళ్ళి చేసుకుని మరొకడు, పిల్లల్ని కన్నతర్వాత ఇంకొకడు ఇలా ఎంతకాలం స్త్రీని వేదనాశ్రువుల్లో ముంచెత్తుతాడు? బిడ్డను కోల్పోయిన ఆ తల్లి వేదనను వర్ణించడానికి ఎన్ని అక్షరాలు వాడాలి? ఎన్ని అశ్రువులు చిందించాలి? ఇవన్నీ ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.

దురదృష్టం ఏమిటంటే మనిషి మనీకి బానిసై పోయాడు. ఎలాంటి ఘోరాన్నైనా డబ్బుతో కడిగేయగలమనే ఆలోచన ప్రతి ఒక్కరిలో నిక్షిప్తమైపోయింది. నిత్యం అధికారాన్ని కాపాడుకోవడం, పదవుల్ని కాపాడుకోవడంతోనే జీవితాలన్నీ గడచిపోతున్నాయి.

అంతస్తుల ఆకలి తీరదు. అధికార దాహం తీరదు. దాంతో నేరాలు తప్పవు. నిర్భయ చట్టం అన్నారు. ఏమయింది? షీ టీమ్స్ అన్నారు ఎవరిని కాపాడుతున్నాయి? నేరాలు జరిగాక మేము వస్తాం కానీ నేరం జరుగుతుందని వెనకే తిరుగుతామా? అని స్టేట్ మెంట్ ధైర్యంగా ఇస్తున్న హోంశాఖ అధ్వర్యంలో మనం భయపడుతూ కాక ఎలా ఉండాలి? ఆడపిల్లకు ఇక రక్షణ ఏది? ఇపుడు స్త్రీ పురుషులకు కావాల్సింది సెక్స్ ఎడ్యుకేషన్ కాదు. ఎందుకంటే ఆ దిక్కుమాలిన వివరణ తెలియనివారు లేరు. మనిషి మనుగడను కాపాడే తాత్త్విక ఆలోచన. మనిషిని ఉన్నతీకరించడం కోసం మానవుడే తనతోటి మనిషిలో ఎలా ప్రవర్తించాలో, ఎందుకు మర్యాద, మన్నన పాటించాలో తెలుసుకునే ఆధ్యాత్మికత, శరీరానికి, ఆత్మకు మధ్య గల సంబంధ బాంధవ్యం, మనిషి పుట్టుక. చావుల మధ్య జరిగే అంతర్లీనమైన అంతర్యం. ఇవి తెలియకపోతే ఇకముందు ముందు మనిషికి జంతువుకు పెద్దగా తేడా కనిపించని రోజులు దగ్గరలో ఉన్నాయి.

దాదాపు 230 కవితలున్న ఈ సంకలనం లో ఏ ఒక్క కవితనూ కించపరచలేము. అన్నీ కీర్తి కిరీటాలే.. వేదనతో నిండిపోయిన కాగడాలే... వీటిలో మంటకలిసిన మానవత్వం గురించీ, నిత్యం రోదిస్తున్న స్త్రీల మనస్సుల గురించి, ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రతీకారం జ్వాలల్ని వెదజల్లుతూ, ఇవన్నీ చూస్తూ మౌనంగా ఉంటున్న పదవీకాంక్షల్ని ఎండగడుతూ వలస పోయిన దేవుళ్ళను పిలుస్తూ, మానవ మృగాల బారినుండి ఎలా తప్పించుకోవాలో అని మార్గాలు వేస్తూ, అనేక భావాలలో ఆవేదనల్ని, కవులు తమ వేదనల్ని వెలిబుచ్చారు. నవ, యువ, ప్రముఖ కవులు సైతం తమ తీవ్రమైన పదజాలాన్ని వాడుతూ తమలోని బాధను తెలియజేసారు.

ఒక మహిళగా ఆ వేదనను ఒకచోట చేర్చి వీటి వలనైనా కొందరిలోనైనా మార్పు వస్తుందని గొప్ప ఆశయంతో ఒక సంకలనంగా తీర్చిదిద్దిన పురిమళ్ళ సునంద గారికి మన:పూర్వక అభినందనలు.

ప్రతులకు: భోగోజు ఉపేందర్‌రావు
ఫోన్: 9441815722

## సృష్టిలో సదా!?

పేగును తెంచిస్తుంది
ప్రేమను పంచిస్తుంది
మాటలతో లాలిస్తుంది
పాటను పలికిస్తుంది
బాటను చూపిస్తుంది
జాబిలంటి హాయినిస్తుంది
నీవు కంట తడిపెడితే!?
ఆ గుండే చెఱువౌతుంది
అందుకే నేనున్నానని ఓదారుస్తుంది
నీవు భీతితో తడబడి అడుగిడితే
అడుగొ దేవుడనే ధైర్యాన్నిస్తుంది!
నువ్వు శ్రమిస్తే తాను స్పందిస్తుంది
నీ బ్రతుకును పూదోటగా మలుస్తుంది
అందుకే తాను కర్పూరమై కరుగుతుంది
నువ్వు ప్రయోజకుడివైతే మాత్రం!
నీకు నీరాజన స్వాగతమిస్తూ!
ఈ జన్మకిది చాలంటూ!
నీ ప్రగతికి మురుస్తుంది!

తన బ్రతుకును
వాడిన పువ్వులా ముగిస్తుంది!
ఐనా!.. సతతమూ ఆ సుగంధాల్నే!
నీకే ఈ భువిపై మిగులుస్తుంది!
తాను మాత్రం
దివిలో ధృవ తారలా నిలుస్తుంది!
ఇంతకూ ఇంత చేసిందీ
ఎవ్వరో కాదు
నీవు తీర్చుకుందామన్నా
ఋణం తీర్చుకోలేని అమ్మ!
అందుకే సృష్టిలో సదా
తీయనదీ జన్మ!



**- దోసపాటి సత్యనారాయణమూర్తి**
9866631877

## నిరర్థకం

అక్షరాలు కనిపించి మాయమౌతున్నాయ్ పైపైకి
పదాలు పెదాలపైనే ఆడుతున్నా జారిపారిపోతున్నాయ్ లోలోకి
వాక్యాలు జాలువారుతున్నట్టే ఉన్నాయ్
సిరా మాత్రం ఒలకట్లేదు కాగితంపై
అణువణువుల్లో ఆదర్శాలు ఎదిగి ఎదిగి
విచ్ఛిన్నమై పోతున్నది కావ్యదేహం
అనంత విశ్వంలోకి అనుపానులైనా లేకుండా
కరిగిపోయి ఇరిగిపోయాయి కవితా సంకలనాలు
భావ దాస్యపు బంధనాలు తెంచుకోలేక
జనజీవన జాగృతి కొంచెమైనను చేయలేక
నిరర్థక జీవిత లక్ష్యాన్ని ఇంకనూ కనుగొనలేక..

**- డా॥ మానస్ కృష్ణకాంత్**

## నవ జీవనం!

పెంచుకున్న ప్రేమలేమో
పేరుకైనా లేనె లేవుగ
పంచుకొనుటకు హృదయ మొక్కటి
చెంత నిలువదుగా!
ఆశలేమో ఆవరించగ
ఆత్మీయతలే అడుగునంటగ
మమతలెట్టుల వెల్లివిరియును
మహిని స్వచ్ఛముగా!
ప్రతి నిమిషము కాలయాపన
పనికి మాలిన ప్రేలాపన
లోనె కాలము వ్యర్థపుచ్చుట
లోనె మునుగుదురే!

సజ్జనుల మాటలను వినకను
సర్వమెరిగిన వారివలెనటి
యించుచు నరులెల్ల యనిషము
విర్రవీగుదురే!
వెల్లివిరిసెడి ప్రేమ సుమముల
సౌరభమ్ముల గ్రోలుచును మది
సుధలు గురియు సుభాషితమ్ముల
పలుకవలె యెపుడు!
ప్రతి హృదయమున ప్రేమబంచిన
వెతలు మానును ప్రతిక్షణమున
మలిన మెరుగని సమసమాజము
చివురులెత్తును మెప్పుడు!

**- సుప్పని సత్యనారాయణ**
9492626910

## "మనసు పాడింది సన్నాయి పాటలా" అలరించే వినోదమయం - వినయం

అవతల వ్యక్తిని అగౌరవ పరచనివ్వని అమూల్యం - వినయం
కరకుతనాన్ని - కాలిడనివ్వని కమనీయం - వినయం
ఆహా-ఓహో అని అలరిస్తూ - కలిగించదు - అసౌకర్యం - వినయం
పలకరింపులోనే - పులకింతను ప్రసాదించే - పూజనీయం - వినయం

అసమానతలను - అడుగిడనివ్వని ఆణిముత్యం - వినయం
బ్రహోత్సవం లాంటి భరోసానందించే భానోదయం - వినయం
ఏయ్-ఏయ్ అంటూ - బ్రతుకును చేసుకోనివ్వదు - విషవలయం - వినయం
పుష్యరాగమంటి - ప్రగతిని సాధించుకునేలా చేసే - పూర్ణోదయం - వినయం

అవరోధాలను - అధిగమింప చేసే - అభ్యుదయం - వినయం
విలక్షణమైన - విచక్షణత - మెలిగేలా చేసే - విశ్వవిద్యాలయం - వినయం
ఏరా - రారా - బాగున్నావారా - అంటూనే - ఆరాలు తీయనివ్వని ఆలయం - వినయం
జీవన రీతిని - రమణీయంగా - మలచుకునే రసరమ్యం - వినయం

అక్షరజ్ఞానం లేకున్నా - అక్కరనెరిగి - అక్కున చేర్చుకునే - ఆణిముత్యం - వినయం
మానవీయతను - మరాకు వేయించే - మహోదయం - వినయం
సంతృప్తికర - జీవన సాఫల్యం చేకూర్చే - తేజోమయం -వినయం
మనసు పాడింది - సన్నాయి పాటలా అలరించే వినోదమయం - వినయం.



**-లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 94404 48650

## మీ కోసం

మేలైన మాను సంతతిని
మేని పత్ర సుగంధాన్ని
మీ ఉనికికి ఊతాన్ని
మీ ఊపిరికి మూలాన్ని
కాలుష్యం భగభగలు పీల్చే
ఆకుపచ్చ అమ్మను

ఆజన్మాంతం
నా ఒడిలో శ్వాసిస్తూ
ఎవరెస్టులై ఎదిగే
మనుగడ ముఖ చిత్రాలు మీరు

మీ కేంద్రనాడీ మండలాల్లో
హరిత చెమ్మను ప్రసరించి
హృదయ అలారాలుగా
ధ్వనింప చేసేదీ నేనే.

అయినా నేనన్నా?
నా పుట్టెడు బలగమన్నా?
ఎన్నడూ సిన్న సూపేనాయే!
మీ బహుముఖ ప్రజ్ఞతో
నా మూలాలను
నాశనం చేస్తున్నారు?
మీ బతుకు పున్నముల్లో
కారు చీకట్లో
కోరి తెచ్చుకుంటున్నారు?
నా బతుకు
నన్ను బతకనివ్వండి!
నగరీకరణ పేరుతో
నిలువునా నరికేయకండి!
మీ కోసం ఎవరినైనా
ప్రతిఘటించే ప్రతిజ్ఞను నేను
మీ క్షేమంకై ఎప్పుడైనా
దండెత్తే దండకారణ్యాన్ని.

**- మండల స్వామి**
9177607603

## సముద్రపు ఒడ్డున!

ఆకాశం
ఒక ముక్కయి
విరిగి పడ్డదా

సముద్రం
ఒక శకలమై
ఎగిసి పడ్డదా

పైనొక అద్దం
కిందొక అద్దం

ఈ దృశ్యాన్ని నిత్యం చూస్తున్నా
ఋషి కొండా! నీ తనివి తీరదు!

ఉండీ ఉండీ సముద్రం
మనమంతా చూస్తుండగానే
ఒక హస్తాన్ని పైకి విసురుతుంది!

యుగ యుగాలుగా
చేయినందుకోవడంలో
ఆకాశం చేసే ప్రయత్నం విఫలం!


ప్రేమకు జననం తప్పా
మరణం లేనట్లు
ఒక ఆరాటం కొనసాగుతూనే ఉంటది!

ఆకాశమూ సముద్రమూ ఏకమైతే
ఋషి కొండా!నీతో పాటు
సముద్రపు ఒడ్డున నిలుచున్న నేనూ
చిరునామా వెతుక్కోవలసిందే!!
(వైజాగ్ ఋషి కొండ బీచ్ లో నిల్చున్నప్పటి అనుభూతి)



**-కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# సహజత్వం నిండిన కవిత్వం "పునరావృత దృశ్యం"




పుష్యమీ సాగర్ తెలుగు కవిత్వానికి సుపరిచితమైన పేరు. వీరి కవిత్వంలో స్వచ్ఛత, నిరాడంబరత, భావపరంగా గాఢత, వస్తు పరంగా వైవిధ్యం అన్నీ అలవరచుకున్న మంచి కవి. దాదాపుగా 50 కవితలున్న ఈ గ్రంథంలో ప్రతి కవితా చదివించ దగినది. కవిత్వం ఉన్న చోటే కవి ఆగిపోతాడు. మనలో కవిత్వం ఎంత వరకు ఉంది అనడానికి మనల్ని ఆకర్షించే కవిత్వం కూడా కొంతవరకు కొలమానం కావచ్చును. నిత్యం అసహనం! అవమానం! హింస! ఆత్మ హత్య! హత్య! ఆటవిక సంస్కృతి లాంటి క్రూరమైన పరిస్థితులనుండి ఎక్కడికి పరుగులు తీస్తాము? ఒకవేళ పరుగులు తీసినా ఎంతసేపు దాక్కుంటాము? దాక్కున్నా ఎంతవరకు జీవిస్తాము? లాంటివన్నీ సందేహాలే! ఉదాహరణకు ఒక వ్యక్తి మరో వ్యక్తిని నమ్మి ఆ వ్యక్తిలోని ఆవేదనను తుంచి, తనలోని ఆనందాన్ని కాస్తంత పంచి ఆదరిస్తే... ఇవన్నీ మరచిపోయి అదే వ్యక్తి ఉనికిని సైతం కూలదోసే వ్యవస్థ మనది. కనుక ఎవరిని ఆదరిస్తాం? ఎవరిని నమ్మగలం? ఎవరితో మనస్ఫూర్తిగా మాట్లాడగలం? ఎవరితో మనగలం? అంటే ఒక వ్యక్తి తన జీవిత కాలంలో నమ్మకమైన ఒక వ్యక్తినే సంపాదించుకోలేనప్పుడు మరి వ్యవస్థను మనకనుగుణంగా ఎలా మలచుకోగలం? అనేది ఆలోచన.

అదే ఆవేదనతో, అవే ఆలోచనలతో కొన్ని ప్రశ్నలు వేయగలం. అందులో సగం మాత్రమే సమాధానం రాబట్టగలం. కవిత్వం అంతే! దు:ఖాన్ని పరుస్తాం. సంతోషాన్ని వ్యక్తీకరిస్తాం. కోపాన్ని బహిర్గితం చేస్తాం. ఆనందాన్ని పాటగా మలచేస్తాం. ఆత్మీయ తను అక్షరీకరిస్తాం. కానీ వీటికి ప్రతిగా మనవేం పొందగలం? అనుకుంటే పొరపాటు. సరిచేయాలనుకోవడం కవి పని. ఎప్పటికైనా మారకపోతుందా అనే ఆశించడం కవి ఆలోచన. తప్పకుండా తెలుసుకుంటారనే కవి నమ్మకం.

అరె! ఇంతెందుకు? భగవంతుడా ? ఎక్కడున్నావు? పొరపాటున ఎదురుపడినా నిన్ను గుర్తించేవారు ఎవరు ఈ లోకంలో? అందుకే రాకు.. మా కష్టాల పొగల్లోకి మమ్మల్ని వెళ్ళనీ..! మా వేదనా గానాల్లో మమ్మల్ని మునిగి తేలనీ" అనే వాక్యాలు అనాలనిపిస్తోంది వీరి కవిత్వం చదువుతుంటే. మంచి కవిత్వానికి చిరునామాగా కొందరే కవులున్నారు. అందులో పుష్యమీ సాగర్ ఒకరనడానికి సందేహం అవసరం లేదు. కొన్ని వాక్యాలు గమనించండి...

**"ఒక దు:ఖం నన్ను వెంటాడుతుంది/ సమూహంలో కలిసినప్పుడో, వ్యక్తిగతంగా కుదురు కున్నప్పుడో/ నిర్లిప్త భావంతో నన్ను / అల్లుకుంటుంది/ ఆనందపు జీవితకాలం ముగిసాక /దు:ఖమెప్పుడు వొద్దని ముచ్చటే!!"..**

**" నా ప్రపంచంలో / కూలిన వంతెనల గుండా/ మాటలు చిక్కుకుని విల విలలాడినప్పుడు/ ఎండసోకని మూలాలలో నన్ను నేను / ఎప్పటికప్పుడు తప్పిపోతాను".....**

**"లాభనష్టాల ఉచ్చులో/ సగటు రైతు ఉరి వేసుకున్న దృశ్యాలను చూడలేక/ కళ్ళు మూసుకుని నిరసన/ తెలియజేస్తుంది.."...**

**"ఒక యుద్ధం నా లోపల/ నాకు నేనే ఒక సైన్య సమూహం/ గెలుపు ఓటములు/ తెరచాప నావలు నా జన్మకు" ...**

**"తరతరాల అడవి విత్తనం/ ఇప్పుడు బిక్కచచ్చి దీనంగా ఉంది"** వంటి వాక్యాలు ఈ సంపుటిలో అనేకం మనకి కనిపిస్తాయి. రచనలో నిబద్ధత ఉంటే బహుశా కవిత్వం ఇంత అందంగా వ్యక్తీకరించబడుతుందేమో!

శిఖరాలెప్పుడూ గాయలే మిగుల్చుతాయి. అలాగే హృదయాలు ఎపుడూ భయాల్నే మిగల్చుకుంటాయి. తెల్లవారితే బయట ప్రపంచంతోనే పని... పొద్దెక్కితే ఇంట్లో ఆకలి తీర్చే పని. మిగిలినదంతా మనో గాయాలకు మందు రాసే పని.. ఇంతే జీవితం.. అనిపిస్తుంది "గింజలపై బతుకురాత" కవితలో ఈ కింది వాక్యాలను గమనిస్తే **" ప్రతి తిండి గింజపై రైతు పేరు రాయబడాలి అంటే/ రైతు తన జీవితం పై మృత్యు సంతకం చేయ్యాల్సిందే/ రెక్కలు ముక్కలు చేసుకుని/ రాత్రిళ్ళను పొలంలో దిగేసి/ దిగంతాల్లో చుక్కై పోవాల్సిందే/ ఇదే నేడు నడుస్తున్న చరిత్ర"** అనడం ఎంతో భావస్ఫోరకంగా వుంది. ఇలా సాగిన వీరి సంపుటి అంతా స్వచ్ఛమైన కవిత్వమే ఉంది. మరికొన్ని పునరావృత దృశ్యాలకై ఎదురుచూస్తూ.. అభినందనలు..

ప్రతులకు: సిహెచ్ పుష్యమీ సాగర్
ఫోన్: 9010350317
మరియు అన్ని పుస్తక కేంద్రాలు



**-శైలజామిత్ర**
9290900879

## ఓసీ డెంగ్యూదోమా-నశింపుమా!

శా॥ ఎట్లోదూరిగృహంబులో,జనులపైకెక్కి నీకొండితో
గాట్లన్ వేయుచు మృత్యుదూతవలె రక్తంబున్ ప్రవేశించుచున్
"ప్లేట్లెట్ కౌంట్లు" కృశింప జేసెడి మహాభీతావహంబైన నీ
గుట్లున్ మట్లనెరింగి ద్రుంచవలె "డెంగ్యూదోమ" నీయున్కినే!


మ॥ "తెరలున్", "కాయిలు","మ్యాట్లు","బ్యాట్లు"ననుచున్ తీవ్రప్రయత్నంబులన్
నరులెన్నెన్ని ప్రయాసలందినను నీ నైపుణ్యమున్ జూపుచున్
మురుగున్ చెత్తల కోటలో వెలసి ముప్పున్ గూర్చ దండెత్తు నీ
దురితంబింక సహింజాలముగదే దోమా! యికన్ చావుమా!

శా॥తండాలందు వసించు పేద ప్రజపై దాష్టీకమున్ జూపుచున్
తుండమ్మెత్తుచు కుట్టి రోగమిడు నీదుశ్చేష్ట లింతింతలై
గండంబుల్ కలిగింప పిల్లలకు, నీగర్వంబు నీర్గారగా
చెండాడన్ వలె గాదెనిన్ మశకమా చేబూని సంకల్పమున్!

ఉ॥ లొంగవునెట్టి మందులకు,లొంగవునెట్టిప్రయత్నమూనినన్
దొంగగ దూరి ఇండ్లకడ దోపిడి చేసెదు స్వాస్థ్యమంత,నీ
సంగతి తేల్చగావలెను,శాశ్వతమైన సమాధి గట్టగా
మంగళమౌను పృథ్విపయి, మానవజాతికి వీడురోగముల్!

మ॥దయలేకుండ మలేరియాజ్వరమునందన్ జేసి నీగాట్లతో
జుయిజుయ్యంచును వృద్ధియౌచు,పెను సంక్షోభమ్ము గామారుచున్
భయమున్ గూర్చెడి నిట్టి డెంగ్యు జ్వరమున్ వ్యాపింపగాజేయు నీ
చెయిదమ్మెల్ల నశింప జేసెదము ఛీఛీ!దోమ!వైదొల్గవే!

ఉ॥ దోమయె రోగవాహకము,దోస్తులు దానికి చెత్తకుప్పలే!
దోమలువృద్ధిచెందగ యథోచిత రీతి సహాయకారులై
సోమరులైన మానవులె చూపిరి దానికి దారి,నింకపై
నేమమతోడ శుభ్రతను నేర్చిననే నశియించు దోమలున్!



**-ఎస్ సాయిప్రసాద్**
9440470774

## ఖిలం-అఖిలం

మరేం పర్వాలేదు
ఎవరో వొకరు
తొలి అడుగు వేయావల్సిందే కదా!
తొలకరి చినుకుల పూలు వర్షించనిదే
నేలతల్లి మాతృత్వం వికసించదు కదా!
పొలాల గుండెలపై హలాల కలాలతో
అక్షరాల విత్తులు నాటుకుంటూ వెళితేనే
పంటల కవితకు చైతన్య శ్వాస అందేది
నదుల్నీ, కాల్వల్నీ, అలుగుల్నీ, మడవల్నీ కాదు
ముందుగా మనం నేలని కదా కల కనవల్సింది
నేల పొరల్లో నిస్త్రాణాగా వున్న ప్రాణాన్ని
పైకి తోడి చాలు గుంతల్లో వొలకబోయాలి
అప్పుడే విత్తులో ప్రాణ సంధానం
సున్నితంగా ఎదుగుతున్న పైరు నరనరాల్లో
విస్తృతంగా సంగమించే ప్రాణ ప్రవాహం
ప్రాణం ప్రవహిస్తేనే కదా ధాన్యసిరి దోసిట్లో నవ్వేది
మరేం పర్వాలేదు
ఎవరో వొకరు పూనుకుంటేనే తప్ప
ప్రపంచంలో ఏదీ సాధ్యపడదు!



**- గుర్రాల రమణయ్య**
సెల్: 996321943

## జాషువా కు నివాళులు



కష్ట కాలంలో
కారణ జన్ము లు
జన్మిస్తారన్నది
జగతి సత్యం

దళిత జాతి
జాతి రత్నం
మహాకవి గుర్రం జాషువా

ప్రజలలో చైతన్యమంటూ
అన్యాయన్నీ ఎదిరించుటకు..

అక్షరాలనే
ఆయుధాలు గా
రచనలు చేశారు

ప్రజల గుండెల్లో
ప్రజాకవిగా నిలిచిపోయాడు



**- యెల్ది సుదర్శన్ పద్మశాలి**
సెల్: 09892411067

## అక్షరాన్ని నేను

పల్లవి: అమ్మ పాడిన- పాటయ్యాను
అయ్య నేర్పిన- మాటయ్యాను
నీ భావానికి-భాషయ్యాను
నీ భవితకు- బాటయ్యాను

అక్షరాన్ని నేను- తెలుగు అక్షరాన్ని నేను
యాభై ఆరక్షరాల- వెలుగు రేఖను నేను

చరణం: పలకరించే- మనసయ్యాను
కలవరించే- ప్రేమయ్యాను
కలుసుకునే- బంధమయ్యాను
తెలుసుకునే- తెలివినయ్యాను

అక్షరయాత్రలో ఆశను నేను
ఆశయ సాధనలో ఆకృతి నేను
అందరినీ కలిపి-స్నేహం నేను
కలకాలం కదిలే- కాంతిని నేను

స్వాతంత్ర సమర-నినాదమయ్యాను
సాయుధ పోరాట- బావుటయ్యాను
ప్రజాకళల గుండె చప్పుడయ్యాను
బహుజన హితాఃయని భాసిల్లాను ॥అమ్మ పాడిన॥

తూర్పున ఎగిసె-సూర్యున్ని నేను
పడమర చూపే-చంద్రున్ని నేను
అవినీతికి- సింహ స్వప్నమయ్యాను
అన్యాయ్యన్నెదిరించే- ఆయుధానయ్యాను


పదాలతో పల్లవించే- భాష్యం నేను
పద్యం, గద్యం, స్వర-భాగ్యం నేను
భాషా భేదం లేని- ఘన చరితను నేను
అవధుల్లేని- విశ్వ విఖ్యాతిని నేను.

ఏ దేశ మేగినా-ఎందు కాలిడినా
అందునిలిచే-నవ భారతిని నేను
తెలుగువారి-జానపదాన్ని నేను
జగమెరిగిన-జన పథాన్ని నేను
దేశ భాషలందు-తెలుగు లెస్సయ్యాను
మా తెలుగుతల్లికి-మల్లెపూదండయ్యాను. ॥అమ్మ పాడిన॥



**- బి. గోవర్ధన రావు**
9441968930

## భారత జాతిపిత... !



సత్యం ఆయుధంగా చేసి
నిత్యం ఆపదలకెంతో నోచి ..
అహింసే పరమ ధర్మమని
భారతికి స్వేచ్ఛ నిడిన త్యాగశీలి .. !

తెల్లవారి దుష్పరిపాలన
వల్లకాడును మల్లెతోటగామలచిన
పవిత్ర ప్రశాంత సత్య మూర్తి
చే, అంతమయ్యే ఆంగ్లపాలన..!

భరతమాత ముద్దుల బిడ్డ
సహాయనిరాకరణకే మహాఅడ్డ
విదేశీ వస్త్ర బహిష్కరణలతో
సౌమ్య పౌరుష మది వెన్నముద్ద ..!

పెదవుల పై చెరగని దరహాసం
తెల్లవారి దుష్ట విముక్తి కోసం
అహరహం తపించినసౌమ్య శీలి
సత్యాగ్రహపు వీరోచిత సాహసి.. !

నీతి నిజాయతీకి నిలువెత్తు తేజస్సు
శాంతి భారతికి తరగని ఉషస్సు
నవయుగమహాభారతంలో
జాతిపిత భరతజాతికే యశస్సు..!



**-గన్నోజుశ్రీనివాసాచారి**
8555899493.

## మనిషి

నువ్వు నీ నోరు పారేసుకోకు
నీ నుండి నువ్వు పారిపోకు
అంతులేని జీవితపు గర్భంలో
ఎన్నో బేధాలు శోకాలు
వేదనలు, ఆవేదనలు, రోదనలు
అన్నీ నువ్వే అన్నీ నీలోనే
నేటి నుండి నువ్వు మారిపోతావు
నీవు భగవంతుడు సృష్టించిన వాడవు
నీవు విశ్వ శాంతిని నెలకొల్పె మనిషివి

అందరితో కలిసి మెలసిఉండాలి
ఆర్థిక వృద్ధికి తోడ్పడాలి
అందుకే
నువ్వు నీ నోరు పారేసుకోకు
నీ నుండి నువ్వు పారిపోకు.



**- డా॥కర్నాటి లింగయ్య**
సెల్: 9515298610

## పుల్లా మురళీఆకాశ్ మొదటి నవల

# ముగింపు లేని కథ

(గత సంచిక తరువాయి)

"తాతగారు కొంచెం పక్కకు జరుగుతారా" అనడంతో ఈ లోకంలోకి వచ్చాను. "ఆ... రా బాబు అంటూ ఆ పిల్లవాడ్ని పక్కన కూర్చోబెట్టుకు న్నాను. చాలా ముద్దొస్తున్నాడు పిల్లవాడు. నాకు తెలిసి ఒకటో క్లాసు చదువుతున్నాడేమో, మాటలు చాలా ముద్దుగా ఉన్నాయి.

**పెద్దపెద్ద కళ్లు, చిన్న ముక్కు, వాటిని మించి జామపళ్ళలాంటి ఆ బుగ్గలు, ఎంత బాగున్నాడో.**

..తాతగారు అదేంటి అని నా చేతిలోది అడిగాడు.

"ఇది చికెన్ నాన్న అని చెప్పాను".

"తాతా ! చికెన్ మీ ఉర్లో దొరకదా, మా ఊరికి ఎందుకు వచ్చి తీసుకెళ్తున్నారు" అని ముద్దుగా అడిగాడు.

"అదేమి లేదు నాన్నా ! ఆయన మాకు తెలిసినవాడు, ఆయన దగ్గర మంచి చికెన్ దొరుకుతుంది, అందుకే" అని చెప్పాను.

తాత చికెన్‌ను తిన్న తరువాత కదా తెలిసేది బాగుందా లేదా అని అడిగాడు.

"హ....హ... అని నవ్వుతూ, నాన్న అది నమ్మకంతో ఏర్పడి ఉంటుంది, అందుకే అలా వెళ్ళొస్తుం టాను అన్నాను. వానికి ఏమి అర్థం అయిందోకాని "ఆ అవునా తాత" అని సమాధానమిచ్చాడు.

"ఇదేంటి తాత" అని అడిగాడు.

"కళ్ళజోడు" "ఇది నీకు కావాలా" అని అడిగాను.

ఊం... అన్నాడు.

"ఇదిగో తీసుకో అంటూ ఇచ్చాను, వాళ్ళమ్మ వద్దు అని చెప్పరా అని కళ్ళతో సైగ చేసింది. వాడు "వద్దు తాత" అంటూ వెనక్కిచ్చాడు.

"అమ్మా ! పర్లేదమ్మా ! నీ కొడుకు అచ్చం నా మనవడిలానే ఉన్నాడు అందుకే ఇచ్చాను.

"మీరు మీ మనవడికని తీసుకొని పోతున్నారు, వద్దు" అంది.

"అమ్మా నా మనవడికి ఇంకొకటి ఉంది, ఇదుగో" అని చూపించాను. ఒక కళ్ళజోడే తెస్తే విరగొట్టేస్తుంటాడు, అందుకే రెండు తీసుకెళ్తున్నాను, ఉండనీలే ఉంచు" అని ఆ పిల్లాడి చేతిలో పెట్టాను.

"థ్యాంక్స్ తాతయ్య" అన్నాడు ఆ పిల్లవాడు.

"తాతయ్యా అదేంటి" అని అడిగాడు.

అది కొండ

"మరి అది"

అది మబ్బు. "వూరకనే ఉండురా" అంటూ వాళ్ళమ్మ అంది.

"అమ్మా ! పిల్లవాడు ఇప్పుడు తెలుసుకోకపోతే ఇంకెప్పుడు తెలుసుకుంటాడు, తెలుసుకోని అంటూ వాళ్ళమ్మని ఆపేశాను. వాడు నవ్వుతూ ఆడుకుంటున్నాడు. ఆమె బస్సు కడ్డీ పట్టుకొని నిలబడింది.

"సార్ ! మీరు దిగాల్సి చోటు వచ్చింది" అని కండక్టరు అనడంతో లేచి "బాయ్ నాన్న... అం టూ ఆ పిల్లవాడి బుగ్గ గిల్లి, వాళ్ళమ్మకు కూర్చోవడానికి సీటు ఇచ్చి కిందకు దిగడానికి వెళ్తున్నాను.

"గురువుగారు, మళ్ళీ కలుద్దాం అంటూ కండక్టర్ షేక్‌హ్యాండ్ ఇస్తూ చిన్నపిల్లాడిలా బాయ్...బాయ్... చెప్పాడు. నేను చెప్పి కిందకు దిగేశాను. బస్ వేగంగా ముందుకు వెళ్ళిపోయింది.

చిన్నగా నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాను. ఎవరిదో గేట్ ఓపెన్ అవ్వడంతో పైకి చూశాను. ఒక పిల్లాడు, అతని తల్లి కాబోలు మాట్లాడుతున్నా రు. ఆ పిల్లాడు బయటికి బైక్ తీస్తున్నాడు. పద్నాలుగేళ్ళుంటాయి.

"ఒరేయ్ నీకు బైకెందుకురా ఇప్పుడు" అంది వాళ్ళమ్మ. "ఏమి కాదులేమ్మ ఒకసారేగా" అన్నాడు వాడు.

"మీ నాన్న వచ్చినప్పుడు ఇద్దరు కలిసి వెళ్దువులేరా" అంది.

"అమ్మా ఏమి కాదులేమ్మా అంటూ బైకు కిక్ కొట్టాడు.

జాగ్రత్తగా వెళ్ళురా అంది వాళ్ళమ్మ.

"ఆ సరే" అంటూ వెళ్ళిపోయాడు.

అలా చూస్తూ ముందుకు నడిచాను. చిన్ననాటి సంఘటన కళ్ళముందు కదలాడింది. అది వర్షాకాలం. మబ్బులు కమ్ముకున్నాయి. పక్షులన్నీ ఇళ్లకు చేరుకున్నాయి. నాన్న ఊరికెళ్లాడు. అమ్మా, నేను, చెల్లి మాత్రమే ఇంట్లో ఉన్నాం. నాకు వర్షమంటే చాలా ఇష్టం, వానలో తడిస్తే జలు బు చేస్తుదని అమ్మ తడవనివ్వదు. ఎప్పుడైనా తడిసి వస్తే ఏడుస్తుంది. నీకేం తెలుసురా చిన్నపుడు నువ్వు ఎలా సతాయించేవాడివో, నిన్ను తీసుకొని ఎప్పుడూ హాస్పిటల్‌కే తిరగడం అయిపోయింది నా బతుకు. కానీ నువ్వు ఇప్పుడు వద్దురా అన్నా అలాగే తడుస్తున్నావు" అంటూ ఏడుస్తుంది.

అప్పుడు ట్రింగ్... ట్రింగ్ మంటు ఫోన్ మోగింది. నేను పరిగెత్తుకుంటూ వెళ్ళి ఫోన్ తీసాను. చిన్నగా వెళ్ళు అంటూ అమ్మ అరిచింది. ఫోన్ ఎత్తి "సరే సరే" అన్నాను. క్రికెట్ బ్యాట్ నాన్న కొనుకున్నాడో లేదో గుర్తుకు చేద్దాం, ఫోన్ చేశాను, నాన్న కాదు తాతయ్య గొంతు వినిపించింది.

హలో తాతయ్యా ఏమి తాతయ్యా అని అన్నాను.

మీ నాన్న ఉన్నాడారా ? అని అడిగాడు తాతయ్య.

"లేదు తాతయ్య" సరేలే నువ్వు అర్జెంటుగా చిప్పగిరికి రా అని ఫోన్ కట్ చేసాడు.

ఆ సరేలే తాతయ్యా అంటూ నేను ఫోన్ కట్‌చేశాను.

"అమ్మా ! తాతయ్య పోన్ చేశాడు, అర్జెంటుగా ఊరికి పోవాలంటా" అన్నాను.

"రేపు పోదువులే ఇంత సాయంత్రం పూట అంది. ""అమ్మా ! ఏదో అర్జెంటు పని అంటమ్మా, సరేలే బైక్ తాళాలు ఎక్కడ పెట్టావమ్మా"

"అదిగో ఆ గూట్లో ఉన్నాయి" బస్సులో వెళ్ళొచ్చుగా అంది.

"అమ్మ ఆ బస్సులు, ఆటోలు ఎప్పుడు వస్తాయో ఏమో బైక్ తీస్తూ అన్నాను.

"జాగ్రత్తగా వెళ్ళు, వర్షం పడుతుందేమో ఈ గొడుగు తీసుకెళ్ళు అంది అమ్మ"

"బండి నడుపుతూ గొడుగు ఎలా పట్టుకోనే" చిన్నగా నవ్వుతూ అన్నాను.

"చిన్నగా వెళ్ళురా" నువ్వు చాలా స్పీడ్‌గా వెళ్ళుతావు అని మీ నాన్న చెప్పాడు, హెల్మెట్ తీసుకో" అంది అమ్మ. వద్దు అని తలూపుతూ వెళ్ళాను. ఆహా... ఆహా.. నవ్వుతూ నేను ఆ



ఊరిలో ఐదు నిమిషాల్లో అక్కడ ఉండగలనని ఇంటి నుండి వెళ్ళిపోయాను.

'ఏరా ! వెళ్ళిన పని అయిపోయిందా ?" అంది బయట ఉండగానే అమ్మ. నా ఒళ్ళంతా చెమటలు "అమ్మ నేను ఎప్పుడూ వేగంగా వెళ్ళను, ఇంకొక్కసారి హెల్మెట్ పెట్టుకొని వెళ్ళతాను అమ్మ" అంటూ పరిగెత్తుకుంటూ వెళ్ళి అమ్మను కౌగిలించుకున్నాను.

"ఏమైందిరా... ఏమైందిరా..." అని అడుగుతుంది.

అమ్మా, నీళ్ళు కావాలి అని సైగ చేశాను. చెల్లిని పంపించి నీళ్లు తెప్పించి ఇచ్చింది అమ్మ. నీళ్లు తాగాను.

ఎందుకురా భయపడుతున్నావు, అని అడిగాడు నాన్న. అది... అది...



అబ్బా ఎంత పనో ఇప్పటికి అయిపోయింది హమ్మయ్య అని గాలి పీలుచుకున్నాను. రేపు వెళ్దువు ఇక్కడే పడుకుందువు అన్నాడు తాత.

"తాత ఏమి కాదులే తాత, రేపు పొద్దున్నే స్కూలుకు వెళ్ళాలి కదా, అక్కడ అయితే ఇంటి నుంచి వెళ్ళొచ్చు, ఇక్కడి నుంచి ఇంటికెళ్ళి పుస్తకాలు తీసుకొని వెళ్ళాలంటే చాలాసేపు అవుతుంది తాత, ఏమి కాదులే అంటూ బండి తీసి ఎక్కాను, వెళ్ళొస్తా అంటూ బండి పోనిచ్చాను.

**అప్పుడే గాలిదుమారం లేచింది. కళ్ళలోకి దుమ్ము పడుతుంది. కళ్ళలో నుంచి నీళ్ళు కారుతున్నాయి. బండి వేగం పెంచాను.** ఇళ్ళకు చేరుకోవాలని బైక్‌లు, వివిధరకాల వాహనాలు పోటాపోటీగా ఇంటికి వెళ్ళు తున్నాయి.

నా బండి వేగం 60 దగ్గరగా పోతుంది. నా వేగం చూసి గాలి దుమారం తగ్గింది. అది చూసి నవ్వొచ్చింది. వేగం పెరుగుతుంది, చిన్నగా వర్షం మొదలైయింది. ఆహా ఏమి నా అదృష్టం వర్షంలో తడవద్దు అని చెప్పడానికి ఇప్పుడు అమ్మ నా దగ్గర లేదు. వర్షంలో ఎంత బాగా తడవచ్చు, ఆడుకోవచ్చు, నాని ఇంటికి వెళ్తే అమ్మ తిడుతుంది.

లారీలు కూడ ఈ రోజు ఎక్కువగా వస్తున్నాయి, ఎప్పుడు ఇన్ని రావే, కళ్ళకు ఎదురుగా లైటు పడుతుంది, ఏమి కనబడదు. ఆ లారీల లైటు వెలుతురుకు ముందే లారీ వెళ్ళుతుంది, పెట్రోల్ ట్యాంకర్ కావచ్చు డ్రైవర్ కిటికీ తెరుచుకొని మరీ పోతున్నాడు. వేగం మరింత పెంచాను. 80కి చేరుకుంటుంది. ఆ లారీను కూడ దాటి ముందుకు వచ్చాను.

అబ్బా ! వర్షం చినుకులు ముల్లులాగా గుచ్చుకుంటున్నాయి. చేతిలో బండిని పట్టుకోలేకపోతున్నాను. బండి ఎదురుగాలికి ప్రక్కకు జరిగి ఎదురుగా వచ్చే వాహనాల రోడ్లలోకి పోతుంది. ఎంత గట్టిగా పట్టుకున్నా ప్రక్కకు జరుగుతుంది. వేగం తగ్గి 60కి చేరుకుంది. ముఖం మీద సూదిలా గుచ్చుకుంటున్నాయి. వర్షపు చినుకులు ఆ నొప్పికి వేగం 40కి చేరింది. ముఖానికి ఏదైనా కట్టుకొని బండి నడుపుదామని అనుకుంటూ ఆలోచిస్తున్నా. నాన్న పొద్దున బండి తుడవడానికి ఒక కొత్త గుడ్డను బండిలో పెట్టాడు. అది గుర్తుకు వచ్చింది. వేగం పూర్తిగా తగ్గించి పక్కకు ఆపాను. ఆ బండి సీటు తీసి ఆ బట్టను ముఖానికి కట్టుకునేంతలో అది ఎగిరి రోడ్డు మీద పడింది. బట్ట తీసుకుందామని దిగాను. లారి హారన్ కొట్టడంతో పక్కకు వచ్చాను.

లారీ ఆ గుడ్డను తొక్కిపోయింది. ఏమి చేస్తాం, ఇంటికి వెళ్ళాలి కదా అని మళ్ళీ గుడ్డ తీసుకునేంతలో బర్ర్ర్... బర్ర్ర్ మని శబ్దం వస్తుంది. గాలి వర్షం ఎక్కువ పడుతుండడంతో మట్టికొట్టుకొని వెళ్ళుతుంది. పాయలుగా నీరు వెళ్తున్నాయి. అవి నల్ల మట్టి నేలలు. మెరుపులతో ఆ ప్రదేశం సరిగా పని చేయని బల్బులా చీకటి వెలుగులతో ఉంది.

ఇంకా ఆ ఉరుములతో ఆ ప్రదేశం మొత్తం దద్దరిల్లుతుంది, మబ్బులు పూర్తిగా కమ్ముకున్నాయి, చెట్లు విరిగిపోయేలా ఉన్నాయి. ఒకటి పిట్టగూడు నేలరాలి గాలికి గొట్టుకువచ్చి నా ముందు పడింది. అందులో ఏ పక్షి లేనందువల్ల మంచిదైయింది. గాలిలో కాకులు ఎగరలేక చెట్టులోకి దూరిపోయాయి. ముడుచుకొని పడుకున్నాయి.

నా బండిని ఆన్‌లోనే పెట్టాను. ఇక్కడ బండి వుంది అని ఆ వెలుతురులో ఒక జింక వేగంగా పరిగెత్తింది, అది నా కళ్ళకు దూరంగా కనబడుతుంది. ఒక బైకు శబ్దం గట్టిగా దగ్గరకు వస్తుంది. బట్ట కట్టుకొని బండి తీయబోయాను. ఆ శబ్దం వచ్చే బండి కళ్ళ చూసాను, బర్ర్ర్ అంటూ వస్తుంది. దాని టైరు కిందకు జారి వంపుగా వెళ్ళి స్పీడ్‌బ్రేక్ ఉండడంతో బండి కింద గీసుకుంటు పోయింది, మనిషి ఆ స్పీడ్ బ్రేక్ కుదుపుకి పైకి ఎగిరి పొలంలోకి దగ్గరగానే వున్న కరెంట్ పోల్‌కు వెళ్ళి కొట్టుకున్నాడు.

అతని బండి అలాగే జారుతూ ఎదురుగా వస్తున్న మరో బండిని ఢీకొంది. ఆ వ్యక్తి గాలిలో ఎగురుతూ పొలంలోకి వెళ్ళి పోలుకు తగిలి పడ్డాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

గుండె వేగంగా కొట్టుకుంది. ఐదు నిమిషాలు గడిచిపోయాయి. జనం పోగయ్యారు. చిన్నగా నడుచుకొంటూ దగ్గరగా వెళ్ళాను. మొత్తం రక్తసిక్తం అయ్యింది. తల నుంచి రక్తం కారుతూనే ఉంది. చేతులు కాళ్ళకు మొత్తం రక్తం అయ్యింది. అక్కడికక్కడే అతను చచ్చిపోయాడు.

ఇంకొక్కాయన హెల్మెట్ పెట్టుకొని స్తంభంకు తగిలి పొలంలో పడడంతో బతికిపోయాడు. నేను అక్కడే ఉండి చాలాసేపు చూశాను. ఎవరో అతని ఫోను తీసి ఫోన్ చేశారు. వాళ్ళ భార్య పిల్లలు వచ్చి ఏడుస్తున్నారు. పాపం ఆ పిల్లలు ఏడ్చిఏడ్చి కళ్ళు ఎర్రగా అయిపోయాయి. ఆమె గుండెలు బద్దలు కొట్టుకుంటూ

> **"నువ్వు లేకపోతే మేము ఎలా బతకాలయ్యా, మన పిల్లల జీవితాలు నాశనం చేసావు కదయ్యా అంటూ ఏడ్చిం ది. ఇక మాకు దిక్కెవరు, మమ్మల్ని ఎవరు చూస్తారయ్యా, నువ్వే నా దేవుడు అనుకున్నాను కదయ్యా...**

లేచిరా నీ పిల్లలు నీ కోసం ఎలా చూస్తున్నారో చూడు" అంటూ ఏడుస్తుంది. పాపం ఆ హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి వారి అమ్మ.

ట్రింగ్... ట్రింగ్.. అని ఫోన్ వచ్చింది.

అదే సమయములో ఆ స్థానంలో తానే ఉంటే తననే నమ్ముకున్న అమ్మ ఏమై ఉండేదో గుండె వేగంగా కొట్టుకుంది. "హలో ! అమ్మా వస్తున్నా" అని బండి ఎక్కాను.

దాని గురించి ఆలోచిస్తే ఇప్పటికీ గుండె కొట్టుకుంటుంది. ఆ పిల్లాడికి తెలియదు తాను బండి నడిపే క్షణం తన చివరి క్షణమైనా కావచ్చు. అతను వెళ్ళిపోయిన తరువాత అతనికి ఆ బాధ ఎలా తెలుస్తుంది.

సార్ అనడంతో ఈ లోకంలోకి వచ్చాను. ఎవరు అని వెనక్కు తిరిగి చూశాను. ఎర్రని అంగి, దాని మీద ఆకుపచ్చని కోటు, బూట్లు పక్కనే తన పెద్ద మనవడితో వచ్చాడు రాఘవయ్య.

"ఏమి రాఘవయ్యా..." అని అడిగాను.

"నా చిన్నకొడుకుది పెళ్ళిసార్, ఇక్కడే ఉండి కూడా పెళ్ళి దగ్గరకు రాకపోతే ఎలా సార్" అన్నాడు.

"సారీ రాఘవయ్య" అన్నాను.

సరేలేండి సార్ మీకు ఎన్నో పనులు ఉంటాయి. ఏమైందిలేండి, ఇప్పుడు వచ్చారు కదా పెళ్ళికి పదండి.

"అదికాదు రాఘవయ్య ఇదిగో ఈ చికెన్ ఇంట్లో ఇచ్చేసి వస్తానయ్య".

"అదేమి కాదు సార్, నా మనవడు ఉన్నాడుగా వాడికి ఇచ్చి పంపిస్తాను, ముహూర్తానికి టైము అవుతుంది. రండి సార్ అంటూ చేతిలోని కవర్‌ని తన మనవడికి ఇచ్చి, ఇంటి దగ్గర ఇచ్చిరమ్మన్నాడు. వాడు పరిగెత్తుకుంటూ మా ఇంటికి వెళ్ళుతున్నాడు.

రండి సార్ మనం వెళ్దాం అంటూ చేయి పట్టుకొని తీసుకువెళ్ళాడు. "ఆహా ! ఆహ్వాన ద్వారం చాలా బాగుందయ్య రాఘవయ్యా అంటూ భుజం తట్టి లోపలికి నడిచాను. రాఘవయ్య బాగా ఉన్నవాడే. పెద్దకొడుకు అమెరికాలో ఉద్యోగం. చిన్నకొడుకు డాక్టర్, వాళ్ళది చాలా పెద్ద ఫ్యామిలీ. అందరూ కలిసే ఉంటారు.

చుట్టూ విద్యుత్‌కాంతులు, పూలతో వెలిగి పోతుంది. కళ్ళకు మిరిమిట్లు గొలుపుతుంది. సూర్యుని వెలుగులా ఉంది. ఒకపక్క పాటలు పెట్టారు, ఆ పాటల సౌండ్ చాలా పెద్దగా ఉంది, అందరూ ఎవరి పనిలో వారున్నారు.

"రాఘవయ్య చాలా బాగుందయ్య పెళ్ళిమండపం" అన్నాను.


"ఏదో నాకు తోచినంతగా సార్" అన్నాడు రాఘవయ్య.

పెళ్ళికూతురు లక్షణంగా ఉంది అంటూ పెళ్ళిమండపం లోకి వెళ్ళాను. నేను రావడంతోనే అతని కొడుకు లేచి ఆశీర్వాదం తీసుకున్నాడు. నేను దీవించాను. మళ్ళీ కిందికి దిగాను. "రాఘవయ్య ఇక నేను వెళ్ళి రానా" అన్నాను.

"అయ్యో, అదేమిటి సార్, పెళ్ళికి వచ్చి భోంచేయకుండా వెళతారా ? ముందు మీరు పదండి" అంటూ భోజనాల దగ్గరకి తీసుకెళ్ళాడు రాఘవయ్య.

వానన గుమగుమలాడిపోతుంది. వంకాయ, చారు, అన్నం, చిత్రాన్నం, ఓలిగ, పెరుగు, స్వీటు ఇంకా ఎన్నో ఇవన్ని వెజ్ తినేవారికే, మరోపక్క మాంసము, బిర్యాని ఇలా చాలా రకాలు చేశారు.

అప్పటికే చాలా మంది భోజనం చేసి తీరిగ్గా కూర్చొని మాట్లాడుతూ ఉన్నారు. పిల్లలు అక్కడకు ఇక్కడకు తిరుగుతూ చాలా ఆనందంగా ఆడుకుంటున్నారు.




రాఘవయ్య నన్ను తినమని బలవంతంగా కూర్చోబెట్టాడు. అని కొద్దిగా పెట్టించుకొని మిగల్చకుండా తినిలేచాను. రాఘవయ్య మాత్రం "మళ్ళీ తింటాను" అని నా నుంచి తప్పించు కున్నాడు.

పక్కకు వెళ్ళి కుర్చీ వేసుకొని ఇద్దరం ప్రశాంతంగా కూర్చున్నాము. రాఘవయ్య తాంబూలం తెచ్చాడు. "ఎందుకులేవయ్య" అని చెప్పినా వినకుండా ఇచ్చాడు. చాలా రోజులకు కడుపు నిండా భోంచేశాను రాఘవయ్య అంటూ తాంబూలం అందుకున్నాను.

"వంటలు బాగున్నాయా సార్" అని అడిగాడు.

చాలా బాగున్నాయి

అప్పుడే వాళ్ళ ఆవిడ అతనిని పిలిచింది. ''ఇప్పుడే వస్తాను సార్ అంటూ వెళ్ళిపోయాడు".

తాను ఇంతసేపు కూర్చున్న కుర్చీలో కాలు పెట్టుకున్నాను. ఎందుకంటే ఉదయం నుంచి బాగా తిరిగి అలసిపోయాను. నా చూపు ఒక కుక్క మీద పడింది. అది అక్కడ ఇక్కడ తిరుగుతూ ఉంది. దానివైపు చూసుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

"ఏమి మనుషులో ఏమో, ఎప్పుడు మారతారో ఏమో. దేవుడు వీరికి నరకంలో కూడ చోటు ఇవ్వడు, ఒక ముద్ద అన్నం కుక్కకు కూడ వెయ్యనివాడికి ఖచ్చితంగా నరకంలో చోటు దొరకదు'' అంటూ మాటలు వినపడ్డాయి.

"ఆ మాటలు ఎక్కడి నుంచి వచ్చాయి అని చూస్తున్నాను. "అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు, వాళ్ళకేమి తెలుసు అన్నం విలువ" అన్న మాటలు మళ్ళీ వినపడ్డాయి.

చెత్తకుప్ప కొంచెం దగ్గరలోనే ఉంది. అప్పుడు కనబడింది రెండు కళ్ళు, ముక్కు, ఒక తొర్రిపండు పెట్టుకొని ఉంది. నా కళ్ళు నేనే నమ్మలేక పోయాను. అది ఒక ఇస్తరాకు. అది ఇంకా ఏమి మాట్లాడుతుందోనని చెట్టు వెనుకకు వెళ్ళిదాక్కు న్నాను.

**ఈ డబ్బు ఉన్నవాళ్ళు పెళ్ళిల్లు, పేరంటాలు అంటూ ఎంతెంతో డబ్బులు పెట్టి కొత్త రూలుగా భోజనాలు పెడతారు. అవి పేరుకేకానీ అవి ఎవ్వరు తినరు. తినకుండా పడేస్తారు.**

"దేవుడా నాకెందుకు ఇచ్చావు ఈ జన్మ. ఈ మనుషులతో పాటు నేను నరకంలో పడడానికా ? వారు పాపాలు చేస్తున్నారు. వారు నాతో కూడ పాపాలు చేయిస్తున్నారు. వారు నన్ను పారవేయడమే కాకుండా నాతో పాటు అన్నం పారవేస్తున్నారు. ఆ పారవేసే అన్నంతో ఎంతమంది మనుషులకు అన్నం పెట్టవచ్చు. రోజు ఎన్నో లక్షలమంది అన్నం లేకుండా ఆకలితోనే చస్తున్నారు.

ఆ పారవేసిన అన్నం కుక్కలైనా తింటాయి అనుకుంటే వాటిని ఆ దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదు. వస్తే టపాకాయలు పేలుస్తూ బెదరకొట్టి భయపడిపోయేలా చేస్తున్నారు. పెళ్ళికొచ్చిన వారిని ఏమన్నా చేస్తాయని ఏమి చేయకుండానే కాళ్లు విరగగొడుతున్నారు.

పాపం ఆ జీవులదీ నా బతుకే. ఎప్పుడు చస్తామో, ఎప్పుడు బతుకుంటామో వాటికే తెలీదు. ఆ కుక్క చూడు ఎలా వుందో" అంటే అటు వైపు చూశాను.

శరీరం ఎంత బక్కచిక్కిపోయింది. ఇంకా ఆ కాలుకు చూడు ఎంత పెద్ద పుండు, కుంటుకుంటూ వస్తుంది.

"పాపం కదా అంది" ఎవరో అని చూశాను నేను. అది ప్లాస్టిక్ నీటి గ్లాసు. మొత్తం ముడుచుకుపోయింది. "దాని కాళ్ళకు గాయం చేసింది కూడ ఆ మనుషులే అంది" గ్లాసు.

"ఎలా ?" అని అడిగింది విస్తరి. "అది ఇస్తరాకులో అన్నం పడి ఉంటే తినడానికి వెళ్ళిందట. మొదటిసారి తరిమారు, పాపం ఇది పిల్లల తల్లి కదా ! తన బిడ్డలకు ఆహారం కోసం మళ్ళీ వెళ్ళిందంటా, అంతే కర్ర తీసుకొని కాళ్ళకు కొట్టారు. కంటికి కూడా వేటు పడి కన్ను పోయింది దానికి సరిగ్గా కనబడదు అంది.

అవునా ? అని విస్తరాకు చూసింది నిజమే. అది తను గమనించలేదు. అయ్యో పాపం అంది విస్తరి.

ఆ కుక్క చూడు విస్తరికి దగ్గరకెళ్ళి వాసన చూస్తుంది. అన్నం మెతుకులు ఉన్నాయోమమని చూస్తుంది. అంది విస్తరాకు, గ్లాసుతో.

"అన్నం మొత్తం మట్టిలో కలిసిపోయింది కదా ! అంది గ్లాసు. దూరంగా గోడ నీడ దగ్గరకు వెళ్ళి కాళ్ళు ముడుచుకొని పడుకొంది కుక్క. దానిని పిల్లల పాలకోసం గొడవపడుతున్నాయి చూడు అంది విస్తరాకు.

"పాపం ఆ పిల్లలకు ఏమి తెలుసు ఇలాంటి దుర్మార్గులు ఉన్నారని" అంది గ్లాసు.

**"మనుషులు అంత అన్నం వృధా చేసేకన్నా కొంచెం అన్నం ఇలాంటి జీవులకు పెడితే ఎంత పుణ్యాం వస్తుంది కదా ! పాపం నాలుగు రోజుల నుంచి అన్నం తినలేదు ఆ కుక్క" అంది విస్తరాకు.**

"వారు తమలాగే ఉన్న మనిషిని కూడ కుక్కకన్న హీనంగా చూస్తారు. ఇక ఈ కుక్క ఎంత వారికి ఒక వెంట్రుకంత తమ వారిని రక్షించాలని రేయి పగలు దొంగలు ఎవరైనా వస్తారని కాపుకాస్తుంది. ఆ విశ్వాసం కూడ లేదు ఆ మనిషికి" అంది గ్లాసు.

"ఏ జీవికి ఆహారం పెట్టారు. ఆఖరికి తనలాగే ఉన్న మనిషికి కూడ, శనివారం, శనివారం గుళ్ళకు వెళ్ళి మరి టెంకాయలు కొడతారు. ఎంతో డబ్బులు పెట్టి ఆకుపూజలన్ని, దీపపూజలని ఎన్నో రకరకాల పూజలన్ని చేయిస్తారు. రాతిలో ఉన్న దేవుడిని చూస్తారు కానీ వారి ముందే కళ్ళెదురుగా తిరుగుతున్నా ఆకలితో ఉన్న మనిషిని, జీవిని మాత్రం చూడరు" అంది విస్తరాకు.

(సశేషం..)

(మిగతా వచ్చేవారం.. )

## తెలంగాణా
## బాల సాహిత్య చరిత్ర సర్వస్వం

తెలంగాణ బాల సాహిత్య వికాసాన్ని గతంలో వివిధ కారణాలుగా రికార్డు చేయడం జరగలేదు. తెలంగాణా బాల సాహిత్య సర్వస్వం రూపొందించాలన్న సంకల్పంతో మానేరు రచయితల సంఘం 'తెలంగాణా బాల సాహిత్య సర్వస్వం' నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా తొలినాళ్ళ నుండి ఇప్పటి వరకు తెలంగాణాలో జరిగిన బాల సాహిత్య సృజన, వికాసాలను రికార్డు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం.

- పాల్కురికి సోమన నుండి నేటిదాకా వచ్చిన తెలంగాణా బాల సాహిత్యం వివరాలు తమకు తెలిసిన వాటిని సూచించాల్సిందిగా, అందుబాటులో ఉన్నవాటిని పంపాల్సిందిగా కోరుతున్నాం.
- తెలంగాణా బాల సాహితీవేత్తలు, సృజనకారులు తమ రచనలు (కథ, కవిత్వం, గేయాలు, వ్యాసాలు, యాత్రా రచనలు, ఇతర అన్ని ప్రక్రియల్లో వచ్చిన బాల సాహిత్యం) ఫోటో, పూర్తి వివరాలు, బయోడేటా, ఇతర సాహిత్యాన్ని పంపగలరు.
- దివంగత రచయితల వివరాలు వాళ్ళ వారసులు, అభిమానులు పంపాల్సిందిగా కోరుతున్నాము. తద్వారా పూర్తిస్థాయి 'తెలంగాణా బాల సాహిత్య సర్వస్వం- సాహిత్య చరిత్ర నిర్మాణం' సాధ్యమవుతుంది. వివరాలను వీలయినంత త్వరగా కింది చిరునామాకు పంపగలరు.

పంపాల్సిన చిరునమా:

గరిపల్లి అశోక్
404, వి.ఎల్.ఆర్ రెసిడెన్సీ
సిద్ధార్థ స్కూల్ పక్కన, శ్రీనివాస నగర్
సిద్దిపేట - 505 301
( మొ. 98487 70345 )

